Follow: @ANNTELUGU

ANN తెలుగు

14-11-2025

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 326 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




# వరల్డ్ వెయిటింగ్ డే

## జక్కన్న.. అదిరే ప్లానింగ్

### మహేష్ మూవీపై ఫుల్ బజ్

**రేపే రామోజీ ఫిల్మ్ సిటీలో మెగా ఈవెంట్**

**వంద దేశాల్లో ఒకేసారి మూవీ రిలీజ్ కు ప్లాన్**

**హైదరాబాద్ -మహా:** ఓ వైపు ఎన్నికల ఫలితాలు.. ఇంకోవైపు ఢిల్లీ బాంబు పేలుడు తాలూకు ప్రకంపనలు.. ఇంత టెన్షన్ ఉన్నా, మహేష్ తో రాజమౌళి చేసే మూవీపై వరల్డ్ వైడ్ గా అటెన్షన్ ఉంది. ట్విట్టర్ జక్కన్న - మహేష్ బాబు మూవీ అప్ డేట్స్, మూవీ పాస్ పోర్ట్ లతో అదిరపోతుండగా, ఈవెంట్ కు సంబంధించిన చర్చ ఈ రెండింటికంటే గట్టిగా జరుగుతోంది. మహేష్ బాబు - రాజమౌళి కాంబోలో వస్తోన్న యాక్షన్ అడ్వెంచరస్ మూవీ ఎస్ఎస్ఎంబీ29. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించి రాజమౌళి బిగ్ సర్ప్రైజ్ ఇస్తున్నారు. ఓ సాంగ్‌ను రిలీజ్ చేయడంతో ప్రియాంక చోప్రా ఫస్ట్ లుక్ రివీల్ చేశారు. ఈ మూవీ టైటిల్‌పై ఫ్యాన్స్‌లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. టైటిల్ ఎప్పుడెప్పుడు రివీల్ చేస్తారా? అని మహేశ్ బాబు ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాజమౌళి బిగ్ ఈవెంట్ ప్లాన్ చేశారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో బిగ్ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 15న గ్రాండ్ ఈవెంట్ జరగనుంది. ఈ వేడుకలో భాగంగా మూవీ టైటిల్‌తో పాటు మహేష్ బాబు ఫస్ట్ లుక్‌ను రివీల్ చేయనున్నారు. దీంతో భారీగా ఫ్యాన్స్ రానున్న నేపథ్యంలో దర్శకుడు రాజమౌళి కొన్ని సూచనలు ఇస్తూ ఒక వీడియో విడుదల చేశారు. ఈవెంట్ పాస్‌లు ఉన్నవాళ్లకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన క్లారిటీ ఇచ్చారు.

మిగతా 2లో

టాప్ న్యూస్

## జూబ్లీహిల్స్‌లో రిగ్గింగ్ జరిగింది

- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ చేశాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్ర రావు కామెంట్స్



02

## భారత్‌తో యుద్ధానికి మేం సిద్ధం

- భారత్, అఫ్గానిస్థాన్‌లతో ఏకకాలంలో యుద్ధం చేస్తాం
- ఢిల్లీ పేలుడు వేళ పాకిస్థాన్ రక్షణశాఖ మంత్రి సంచలనం
- గ్యాస్ సిలిండర్ పేలుడు అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు



02

## పార్టీ మారిన ఎమ్మెల్యేపై అనర్హత వేటు

- హైకోర్టు సంచలన తీర్పు



02




## శాంతించిన నాగార్జున

### కొండా సురేఖపై కేసు విత్ డ్రా

**మంత్రి క్షమాపణ చెప్పడంతో నిర్ణయం**

**హైదరాబాద్, మహా:** మంత్రి కొండా సురేఖకు బిగ్ రిలీఫ్ దక్కింది. మంత్రి, సినీ హీరో అక్కినేని నాగార్జున మధ్య గత కొంతకాలంగా నడుస్తున్న వివాదం సుఖాంతమైంది. మంత్రి కొండా సురేఖ బహిరంగంగా క్షమాపణలు చెప్పడంతో హీరో నాగార్జున సానుకూలంగా స్పందించి వివాదానికి తెరదించారు. ఆ కేసును గురువారం విత్ డ్రా చేసుకున్నారు. మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలపై నాగార్జున గతంలో నాంపల్లి కోర్టులో పరువు నష్టం (డిఫమేషన్) దావా వేశారు.

మిగతా 2లో




## ఒక్క రోజే 20 సినిమాలు

### ఓటీటీలో దండయాత్ర

**మహా:** ఓటీటీ ప్రియులకు ఈ వీకెండ్ పండగే అని చెప్పాలి. దీపావళి రిలీజైన చిత్రాలన్నీ ఓకేసారి మూకుమ్మడిగా ఓటీటీకి వచ్చేస్తున్నాయి. కిరణ్ అబ్బవరం కె ర్యాంప్, సిద్ధు జొన్నలగడ్డ తెలుసు కదా, ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్ సినిమాలు రెండు రోజుల వ్యవధిలోనే ఓటీటీలో స్ట్రీమింగ్ కానున్నాయి.

మిగతా 2లో

# రేవంత్ ధీమా



## విజయం మనదే..

- భారీ మెజారిటీ తథ్యం
- అప్రమత్తంగా ఉండండి
- ముఖ్యనేతలకు సూచన
- నేడే జూబ్లీహిల్స్ కౌంటింగ్
- ఉదయం 10గంటల కల్లా ట్రెండ్స్.. 12 గంటల కల్లా పూర్తి ఫలితం
- పది రౌండ్లలో ఫటాఫట్

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ బైపోల్ లో భారీ మెజారిటీతో విజయం సాధించబోతున్నామని, కౌంటింగ్ ఏజెంట్లు.. ముఖ్యనేతలంతా అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి నేతలకు సూచించారు. కౌంటింగ్ నేపథ్యంలో గురువారం రాత్రి అభ్యర్థి నవీన్ యాదవ్ తో పాటు మంత్రులకు, ముఖ్యనేతలకు సీఎం కీలక సూచనలు చేశారు. 20వేల మెజారిటీ వస్తుందని కాంగ్రెస్ నేతల్లో ధీమా వ్యక్తమవుతుండగా, కౌంటింగ్ సందర్భంగా అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. బీఆర్ఎస్ రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసినా సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉండగా వారిలో1,94,631 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

వివరాలు 2లో

| జూబ్లీహిల్స్ | | | |
|---|---|---|---|
| పోలైన ఓట్లు | కౌంటింగ్ | ట్రెండ్స్ | |
| 1,94,631 | ఉదయం 8 గంటలకు | 10 గంటలకు | |

| బీహార్ | | | |
|---|---|---|---|
| సీట్లు | మ్యాజిక్ ఫిగర్ | ట్రెండ్స్ | |
| 243 | 122 | 10 గంటలకు | |

## తెల్లారిందోయ్.. మావా

### కౌంటింగ్ అప్ డేట్స్‌పై ఉత్కంఠ..

**తెలుగు రాష్ట్రాల్లో 500 కోట్ల బెట్టింగ్‌లు**

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ బైపోల్ రిజల్ట్ పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తెలుగురాష్ట్రాల్లో ఈ బైపోల్ చుట్టూ 500కోట్ల బెట్టింగ్ జరిగింది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. నియోజకవర్గంలో మొత్తం 48.49% పోలింగ్ రికార్డు అయ్యింది. మొత్తం 4,01,365 రిజిస్టర్ అయ్యిన ఓటర్లలో 1,94,631 మంది ఓటు వేసారు. లెక్కింపు షేక్ పేట్ డివిజన్ నుంచి ప్రారంభమై ఎర్రగడ్డ డివిజన్ వద్ద ముగుస్తుంది.

## నియోజకవర్గంలోని ఏడు డివిజన్లలో ఓటింగ్ ఇలా..

- బోరబండ: 53,211 ఓట్లలో **29,760 (55.92%)**
- రహమత్ నగర్: 74,387 ఓట్లలో **40,610 (54.59%)**
- ఎర్రగడ్డ: 58,752 ఓట్లలో **29,112 (49.55%)**
- సోమాజీగూడ: 34,653 ఓట్లలో **14,553 (41.99%)**
- యూసఫ్ గూడ్: 55,705 ఓట్లలో **24,219 (43.47%)**
- షేక్ పేట్: 71,062 ఓట్లలో **31,182 (43.87%)**
- వెంగళ్ రావు నగర్: 53,595 ఓట్లలో **25,195 (47.00%)**

## సీఎం సార్.. మీరు సూపర్

- భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ విజన్ పై పారిశ్రామిక వేత్తల ప్రశంసలు
- హైదరాబాద్‌లో రోడ్లకు దిగ్గజ కంపెనీల పేర్లు
- నేతల పేర్లకు బదులు కొత్త ట్రెండ్.. రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన
- హైదరాబాద్ లో హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ క్యాంపస్ లకు ఆహ్వానం

02

## తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 15వ తేదీ నుంచి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.ఈ దరఖాస్తులు స్వీకరణకు తుది గడువు నవంబర్ 29వ తేదీతో ముగియనున్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 3వ తేదీ నుంచి జనవరి 31వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు 6లో

## తెలంగాణపై చలి పంజా

### అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

**వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం**



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో చలి వణికిస్తోంది. ఈ ఏడాది శీతాకాలం ప్రారంభం నుంచే చలి తీవ్రత ప్రారంభమైంది. గత వారం రోజులుగా రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. కొన్ని చోట్ల సింగిల్ డిజిట్, చాలా ప్రాంతాల్లో 12 డిగ్రీల కంటే తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కరీంనగర్, రాజన్నసిరిసిల్లలో అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో అత్యంత కనిష్టంగా 8.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 8.2 నుంచి 15.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాబోయే రెండు రోజులు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 23 డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మిగతా 2లో

## మన జిల్లాకు సుదర్శన్ రెడ్డి వాస్తవిక మంత్రి

### మెడికల్ కాలేజ్, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు, కెనాల్ ఆధునీకరణలో కీలక పాత్ర


**సుదర్శన్ రెడ్డి సన్మాన సభలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

**బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులను అటకెక్కించిందని విమర్శ**




**నిజామాబాద్, మహా:** ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం నిజామాబాద్‌లో నిర్వహించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సన్మాన సభలో టీపీసీసీ చీఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాకు అనుభవం, ఆలోచన, అభివృద్ధిలో సుదర్శన్ రెడ్డి పెద్దన్నల వంటి నాయకుడు అని కొనియాడారు. ప్రజల సమస్యలను తన సొంత సమస్యలుగా భావించే నాయకత్వమని గుర్తు చేశారు.

మిగతా 2లో



## రూ. 11,399.33 కోట్లతో రోడ్ల పనులు

### రాష్ట్రంలో 419 రోడ్లకు మహర్దశ



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధిని వేగవంతం చేసేందుకు హైబ్రిడ్ అన్యుటీ మోడ్ (హ్యామ్) ద్వారా చేపట్టే రోడ్డుల నిర్మాణం, విస్తరణకు సంబంధించి ప్రభుత్వం సవరిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్ అండ్ బీ శాఖ ఫేజ్ 1 పరిధిలో మొత్తం 419 రోడ్ల పనులను 32 ప్యాకేజీల్లో రూ.11,399.33 కోట్ల వ్యయంతో ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకుముందు ప్రకటించిన హ్యామ్ ప్రతిపాదనల్లో మార్పులు చేస్తూ నూతన ప్రతిపదానలను ఆమోదించారు.

మిగతా 2లో

## దేశ వ్యాప్తంగా 32 కార్లతో దాడులకు కుట్ర?

### విచారణలో వెలుగుచూస్తున్న సంచలనాలు

02

# సీఎం సార్.. మీరు సూపర్

- భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ విజన్ పై పారిశ్రామిక వేత్తల ప్రశంసలు
- హైదరాబాద్‌లో రోడ్లకు దిగ్గజ కంపెనీల పేర్లు
- నేతల పేర్లకు బదులు కొత్త ట్రెండ్.. రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన
- హైదరాబాద్ లో హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ క్యాంపస్ లకు ఆహ్వానం

**ఢిల్లీ, మహా :** అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉన్న హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని రేవంత్ అన్నారు. ఢిల్లీలో గురువారం జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలుభారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సు (యూఎస్ఐఎస్ పీఎఫ్) లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఇన్నాళ్లు ఎక్కడైనా రోడ్లకు ప్రముఖులు, రాజకీయ నాయకులు, సంఘ సేవకుల పేర్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. అది వారిని గౌరవించడంతో పాటు వారి సేవలను గుర్తు చేసుకోవడానికి ఉపకరిస్తుందని అలా పెట్టడం సాధారణం. అయితే ఇక మీదట హైదరాబాద్‌లో రోడ్లకు నేతల పేర్లు పెట్టే ట్రెండ్ మార్చి.. ప్రముఖ కంపెనీల పేర్లు పెట్టాలని భావిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి సంస్థల పేర్లను ఇవ్వాలన్న ఆలోచన ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే తన మొదటి ప్రాధాన్యత అని రేవంత్ రెడ్డి వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారనుందన్నారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ క్యాంపస్ లు**

హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాలు తెలంగాణలో క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించారు. ఢిల్లీలో జరిగిన అమెరికా భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఢోకా లేని నగరం హైదరాబాద్ అని ఆయన వివరించారు. హైదరాబాద్ పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని తెలిపారు. తెలంగాణలో పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటు ఉందని వెల్లడించారు. గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీల ప్రభుత్వాలు సారథ్యం వహించినప్పటికీ.. పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారంగా నిలిచిందని సీఎం వివరించారు. జీసీసీలకు గమ్యస్థానమైన హైదరాబాద్‌లో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. మహిళా సాధికారితతో పాటు నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధి వంటి మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

**23నెలల్లో అనేక కార్యక్రమాలు**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత 23 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా నిర్మించనున్నామని తెలిపారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల తరహాలో హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని సీఎం వివరించారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని ఈ సందర్భంగా ఆయన వివరించారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ప్రదర్శించారు. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు సభ్యులలో అత్యధికులు డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు కు హాజరవుతారని, తెలంగాణ విజన్‌ను దగ్గరగా తెలుసుకునేందుకు ఆసక్తిగా ఉన్నామని యుఎస్ఐపీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ ముఖేష్ ఆఘీ తెలిపారు.

**సీఎంకు అభినందనలు**

తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి లక్ష్యం ఢిల్లీలో జరిగిన యూఎస్ఐఎస్ పీఎఫ్ వార్షిక సమావేశంలో విశేష ఆదరణ పొందింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరించిన సీఎం ప్రసంగం, అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి గారి విజన్ అద్భుతమని, ఇంత పట్టుదల కలిగిన నాయకత్వాన్ని తాము చూడలేదని ఈ సందర్భంగా సీఎంపై ప్రశంసలు కురిపించారు.

## క్షణక్షణం ఉత్కంఠ

రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కౌంటింగ్ శుక్రవారం జరగనుంది. ఇప్పటికే అధికారులు ఓట్ల లెక్కింపుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉండగా వారిలో1,94,631 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 48.49% పోలింగ్ నమోదు అయ్యింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆర్వో కర్ణన్ తెలిపారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఉన్న డీఆర్సీ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'శుక్రవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. 407 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్లు లెక్కిస్తాం. పోటీలో మొత్తం 59 మంది అభ్యర్థులు ఉండటంతో ప్రత్యేక అనుమతి తీసుకుని లెక్కింపునకు 42 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. మొదట షేక్‌పేట్ డివిజన్ లెక్కింపు ప్రారంభమవుతుందని, చివరన ఎర్రగడ్డ డివిజన్ వద్ద ముగుస్తుందన్నారు.మొత్తం10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తిచేస్తామని కర్ణన్ వివరించారు. కౌంటింగ్‌కు మొత్తం 186 మంది సిబ్బందిని కేటాయించాం. ఫలితాలను ఎప్పటికప్పుడు ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాం. మీడియాకు ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ఫలితాలను వెల్లడిస్తాం"అని ఆయన వెల్లడించారు.



# వరల్డ్ వెయిటింగ్.. జక్కన్న.. అదిరే ప్లానింగ్

### మహేష్ మూవీ పై ఫుల్ బజ్

- రేపే రామోజీ ఫిల్మ్ సిటీలో మెగా ఈవెంట్
- వంద దేశాల్లో ఒకేసారి మూవీ రిలీజ్ కు ప్లాన్

(మొదటిపేజీ తరువాయి)

సినిమా విడుదలకు ముందు ఎవరైనా భారీ ఖర్చుతో పబ్లిసిటీని చేసి... తద్వారా మూవీ మార్కెట్ ను పెంచుకుంటారు. దర్శక ధీరుడు రాజమౌళి దానికి పూర్తి భిన్నం. ఆయన సినిమాకు చేసే పబ్లిసిటీని కూడా క్యాష్ చేసుకునే మనిషి. మెగ్నమ్ ఓపస్ మూవీ 'బాహుబలి' ని నిర్మించినప్పుడు ఆయన పబ్లిసిటీ కోసం ఖర్చు పెట్టిందే లేదు. ఆ సినిమాకు ఉన్న క్రేజ్ దృష్ట్యా వందల కోట్ల రూపాయల విలువ చేసే ఫ్రీ పబ్లిసిటీ లభించింది. అప్పుడు పబ్లిసిటీ కోసం పైసా ఖర్చు పెట్టని రాజమౌళి... ఇప్పుడు మహేశ్ బాబుతో చేస్తున్న సినిమా కోసం ఎదురు వసూలు మొదలు పెట్టారు. మహేశ్ బాబు మూవీకి సంబంధించిన గ్రాండ్ ఈవెంట్ 'గ్లోబ్ ట్రాటర్' ను నవంబర్ 14న రామోజీ ఫిల్మ్ సిటీలో జరుపుబోతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచానికి రాజమౌళి ఏం సినిమా చేయబోతున్నారు? ఎలాంటి సినిమా చేయబోతున్నారు? ఇందులోని ప్రధాన తారాగణం, సాంకేతిక నిపుణులు ఎవరెవరూ అనేది తెలియబోతోంది. అయితే ఏ నిర్మాత అయినా ఇలాంటి ఈ ఈవెంట్ ను భారీగా ఖర్చు పెట్టి చేస్తారు. రాజమౌళి అండ్ టీమ్ కూడా అదే పనిచేస్తోంది. ఓ మీడియం మూవీకి అయ్యేంతగా దాదాపు 30 కోట్ల రూపాయలను ఈ ఈవెంట్ కు ఖర్చు చేస్తోంది. అయితే... ఈ ఈవెంట్ ద్వారా మూవీ మేకర్స్ కు డబుల్ బెనిఫిట్. ఈ ఈవెంట్ ను జియో హాట్ స్టార్ లో లైవ్ ఇవ్వబోతున్నారు. ఈ హక్కుల కోసం జియో హాట్ స్టార్ రూ. 50 కోట్లకు పైగా మొత్తాన్ని చెల్లిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వరల్డ్ వైడ్ తన సినిమాకు సంబంధించిన ప్రచారం జరగడంతోపాటు దాని ద్వారా కూడా రాజమౌళి బృందం కోట్ల రూపాయల ఆదాయాన్ని పొందుతోందన్న మాట. రాజమౌళి మాస్టర్ మైండ్ గురించి మరోసారి భారతీయ చిత్రపరిశ్రమ అవాక్కయింది. ఎందుకంటే ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో కాకుండా పాన్ వరల్డ్ స్థాయిలో దీనిని రిలీజ్ చేయబోతున్నారు. దాదాపు వంద దేశాల్లో ఒకేసారి ఈ మూవీ రిలీజ్ కు ప్లాన్ చేస్తున్నారు. సహజంగా తన సినిమా పూర్తి అయిన తర్వాత కానీ ప్రచారం ప్రారంభించని రాజమౌళి... ఈసారి తన పథక రచనను మార్చాడు. మూవీ రెండు, మూడు షెడ్యూల్స్ పూర్తి కాగానే ఓ పెద్ద బ్యాంగ్ తో దీని ప్రచారానికి శ్రీకారం చుడుతున్నాడు. రెండు భాగాలుగా తెరకెక్కబోతున్న ఈ సినిమాను రాజమౌళి గత చిత్రాల మాదిరిగా కాకుండా వేగంగానే పూర్తి చేస్తున్నారు.

**యాంకర్లుగా .. సుమ, ఆశిష్ చంచలానీ**

ఈ సినిమా ఈవెంట్ కు పాపులర్ యాంకర్ సుమ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోంది. దీనికి సంబంధించిన ప్రిపరేషన్స్ గట్టిగా జరుగుతున్నాయి. ఎం.ఎం. కీరవాణి, రాజమౌళి అండ్ టీమ్ తో చర్చలు జరుపుతున్న ఫోటోను సోషల్ మీడియాలో సుమ పోస్ట్ చేసింది. సుమతో పాటు ప్రముఖ యూట్యూబర్ ఈ మెగా ఈవెంట్‌కు హోస్ట్‌గా పనిచేయనున్నారు. బాలీవుడ్‌కు చెందిన ఆశిష్ చంచలానీ హోస్ట్‌గా కనిపించనున్నారు. ఈ విషయాన్ని ఓ ఫన్నీ వీడియో ద్వారా మేకర్స్ రివీల్ చేశారు. రాజమౌళితో కలిసి ఈ వీడియోను రూపొందించారు. అలానే ఈ ఈవెంట్ కు వచ్చేప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియచేస్తూ రాజమౌళి గురువారం ఉదయం ఓ వీడియోను విడుదల చేశాడు. మొత్తంగా మహేష్ మూవీ ఎనౌన్స్‌మెంట్ కూడా టాక్ ఆఫ్ ది మూవీ వరల్డ్ గా మారింది.

# తెలంగాణపై చలి పంజా

**అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు**

**వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం**

(మొదటిపేజీ తరువాయి)

ఈ నవంబర్‌లో గతం కంటే ఎక్కువ చలి తీవ్రత ఉంటుందని తెలిపింది. హైదరాబాద్ నగరంలో శుక్రవారం కొన్ని చోట్ల 1011 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. సుమారు 710 డిగ్రీలు ఉష్ణోగ్రతలు ఉంటాయని పేర్కొంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 16 డిగ్రీలుగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# భారత్‌తో యుద్ధానికి మేం సిద్ధం

### భారత్, అఫ్గానిస్థాన్‌లతో ఏకకాలంలో యుద్ధం చేస్తాం

ఢిల్లీ పేలుడు వేళ పాకిస్థాన్ రక్షణశాఖ మంత్రి సంచలనం

పేలుడు ఘటన గ్యాస్ సిలిండర్ పేలుడు అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు

**ఇంటర్నెట్ డెస్క్:** ఢిల్లీలో కారు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న వేళ.. పాకిస్థాన్ మరోసారి రెచ్చిపోయింది. ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలు మళ్లీ ఉద్రిక్తతలకు దారితీసేలా మారాయి. పాకిస్థాన్ లోయ ఒక బహిరంగ కార్యక్రమంలో ప్రసంగించిన ఆయన, "తూర్పు సరిహద్దులో భారత్‌తో, పశ్చిమ సరిహద్దులో ఆఫ్ఘానిస్తాన్‌తో ఒకేసారి యుద్ధం చేయడానికి పాకిస్తాన్ సిద్ధంగా ఉంది' అని ఖవాజా అసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ ఉగ్రదాడి వేళ పాక్ రక్షణశాఖా మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆసిఫ్ మాట్లాడుతూ.. 'మేము అఫ్ఘనిస్తాన్, భారత్.. రెండు దేశాలతో యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఆపరేషన్ సిందూర్ సమయంలో అల్లా మాకు సహాయం చేశాడు. రెండో రౌండ్‌లో కూడా అదే జరుగుతుందనే విశ్వాసం ఉంది" అని పేర్కొన్నారు.

## ఢిల్లీ పేలుడు ఘటనపై వివాదాస్పద వ్యాఖ్యలు

ఆయన ఈ ప్రకటన చేసిన 24 గంటల ముందే అంటే మంగళవారం ఇస్లామాబాద్‌లో జరిగిన ఆత్మాహుతి బాంబు దాడిలో 12 మంది మరణించగా, 36 మంది గాయపడ్డారు. ఆ దాడికి పాకిస్తాన్ తాలిబన్ బాధ్యత వహిస్తూ ప్రకటన చేసింది. ఈ పరిణామాల మధ్య పాక్ మంత్రి చేసిన వ్యాఖ్యలతో దాయాది సర్కారుపై ప్రజల్లో ఆగ్రహం, భద్రతా లోపాలపై విమర్శలు తీవ్రతరమయ్యాయి. ఈ క్రమంలో ఆసిఫ్.. ఢిల్లీ పేలుడు ఘటనపై కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "అది కేవలం గ్యాస్ సిలిండర్ పేలుడు మాత్రమే. దానిని ఉగ్రదాడిగా చూపిస్తూ భారత్ మళ్లీ పాకిస్తాన్‌పై దాడికి సిద్ధమవుతోంది. ఢిల్లీ బ్లాస్ట్ ఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం భారత్ వాడుకుంటోంది" అని పాక్ మంత్రి ఆరోపించారు. ఆపరేషన్ సింధూర్ తో భారత్ చేతులో చావు దెబ్బ తిన్న పాకిస్తాన్ ఇంకా బుద్ధి రావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అసిఫ్ వ్యాఖ్యలపై భారత్ ఇంకా స్పందించలేదు.

# దేశ వ్యాప్తంగా 32 కార్లతో దాడులకు కుట్ర?

### విచారణలో వెలుగుచూస్తున్న సంచలనాలు

**ఢిల్లీ, మహా :** ఎర్రకోట పేలుడు కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బాబ్రీ మసీదును కూల్చేసిన డిసెంబర్ ఆరున ఢిల్లీలో వరుస బాంబుపేలుళ్లు జరపాలని డాక్టర్ల ముసుగులో ఉన్న ఉగ్రవాదులు కుట్ర పన్నినట్లు తేలింది. ఆరు దశల్లో దాడులు జరిపేందుకు ఉగ్రవాదులు 32 కార్లను సిద్ధం చేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ అధికారులకు పలు కీలక ఆధారాలు లభ్యమైనట్లు తెలుస్తోంది. ఎర్రకోట పేలుళ్లలో మరణించిన కారుతోపాటు పేలిపోయిన డాక్టర్ ఉమర్ నబీ కారు హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్‌లోని మేవాట్‌కు చెందిన అల్-ఫలాహ్ యూనివర్సిటీలో లభ్యం కావడంతో ముష్కరుల ప్లాన్ బెడిసి కొట్టింది. ఎర్రకోట పేలుళ్లు, కారులో డాక్టర్ ఉమర్ నబీ డీఎన్ఏ లభ్యం కావడం, అల్ ఫలాహ్ యూనివర్సిటీలో ఉమర్ కారు ప్రత్యక్షమవ్వడంతో దర్యాప్తు సంస్థలు ఈ యూనివర్సిటీనే ఉగ్రవాదలు తమ కార్యకలాపాలకు అడ్డగా మార్చుకున్నారనే అనుమానాలు మొదలయ్యాయి. దీంతో జాతీయ భద్రతా సంస్థలు పేలుళ్ల కేసును ఆ కోణంలో దర్యాప్తు చేపట్టగా.. 32 కార్లతో దేశ వ్యాప్తంగా దాడులకు పాల్పడేందుకు కుట్ర జరిపిన ఆధారాలు సైతం వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుతం దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అనుమానిత కార్లను గుర్తించేందుకు పోలీసులు,కేంద్ర భద్రతా బలగాలు సంస్థలు అన్వేషిస్తున్నాయి. ఫరీదాబాద్‌లో అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయం సమీపంలోని తన అద్దె ఇంట్లో పేలుడుపదార్థాలను దాచిపెట్టేందుకు ఉగ్రవాదులకు సాయపడిన ఇస్లాం మతబోధకుడు, మౌల్వీ ఇష్తియాఖ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోగా.. మౌల్వీ తరచూ అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయంలో మత సంబంధ కార్యక్రమాలు నిర్వహించేవాడు. అలా ఉమర్, ఘనీసహా పలువురు వైద్యులు, విద్యార్థుల మెదళ్లలోకి ఉగ్రభావజాలాన్ని నింపినట్లు తేలింది.

## ఐఈడీల తయారీ

మౌల్వీ సాయంతో ఉగ్రమూకలు 200 ఐఈడీల తయారీలో ఉగ్రమాడ్యూల్ సభ్యులు గతంలోనే మునిగిపోయారని దర్యాప్తులో తేలింది. ఢిల్లీలోని ఎర్రకోట, ఇండియాగేట్, కాన్స్టిట్యూషన్ క్లబ్, గౌరీశంకర్ ఆలయం, గురుగ్రామ్, ఫరీదాబాద్‌సహా దేశంలోని కీలక ఎయిర్‌పోర్ట్‌లు, రైల్వేస్టేషన్లు, మాల్స్ వద్ద పేలుళ్లు జరపాలని భారీ ప్రణాళిక వేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలిలో అమ్మోనియం నైట్రేట్‌తోపాటు ఒక కొత్తతరహా రసాయనం అశేషాలను పోలీసులు గుర్తించడంతో దేశ వ్యాప్తంగా ఉగ్రకుట్రను భగ్నం చేశారు.

# ఒక్క రోజే 20 సినిమాలు

**ఓటీటీలో దండయాత్ర**

(మొదటిపేజీ తరువాయి)

వీటిలో అక్షయ్ కుమార్ జాలీ ఎల్ఎల్‌బీ3 కూడా ఓటీటీకి వచ్చేస్తోంది. ఇంకెందుకు ఆలస్యం మరి.. మీకు నచ్చిన సినిమాలు ఎక్కడెక్కడ స్ట్రీమింగ్ కానున్నాయో ఓ లుక్కేయండి.

**నెట్‌ఫ్లిక్స్..**

తెలుసు కదా(తెలుగు సినిమా) నవంబర్ 14
డ్యూడ్ (తెలుగు సినిమా) నవంబరు 14
ఇన్ యువర్ డ్రీమ్స్ (ఇంగ్లీష్ మూవీ) నవంబరు 14
జాక్ పాల్ vs ట్యాంక్ డేవిస్ (ఇంగ్లీష్ సినిమా) నవంబరు 14
నోవెల్లే వాగ్ (ఫ్రెంచ్ మూవీ) నవంబరు 14
లెఫ్టర్ ది స్టోరీ ఆఫ్ ది ఆర్డినరీస్(హాలీవుడ్ మూవీ) నవంబరు 14
ది క్రిస్టల్ కుక్కు (స్పానిష్‌థ్రిల్లర్ మూవీ) నవంబరు 14

**జియో హాట్‌స్టార్**

జాలీ ఎల్ఎల్‌బీ 3 (హిందీ మూవీ) నవంబరు 14
అవిహితం (తెలుగు డబ్బింగ్ సినిమా) నవంబరు 14
జురాసిక్ వరల్డ్ రీబర్త్ (తెలుగు డబ్బింగ్ మూవీ) నవంబరు 14

అమెజాన్ ప్రైమ్

నిశాంచి(హిందీ సినిమా) నవంబర్ 14
మాలిస్ సీజన్1(హాలీవుడ్ సిరీస్) నవంబర్ 14

**జీ5**

దశావతార్ (మరాఠీ సినిమా) నవంబరు 14
ఇన్‌స్పెక్షన్ బంగ్లా (మలయాళ సిరీస్) నవంబరు 14

**ఆహా**

కె ర్యాంప్ (తెలుగు సినిమా) నవంబరు 15

**సన్ నెక్స్ట్**

మారుతం(తమిళ సినిమా) నవంబర్ 14
దండకారణ్యం(తమిళ సినిమా) నవంబర్ 14

**ఆపిల్ టీవీ ప్లస్**

కమ్ సీ మీ ఇన్ ద గుడ్ లైట్ (ఇంగ్లీష్ సినిమా) నవంబరు 14

**మనోరమ మ్యాక్స్**

కప్లింగ్ (మలయాళ సిరీస్) నవంబరు 14

**సింప్లీ సౌత్**

పొయ్యమొళి (మలయాళ సినిమా) నవంబరు 14
యోలో (తమిళ మూవీ) నవంబరు 14

# రూ. 11,399.33 కోట్లతో రోడ్ల పనులు

**రాష్ట్రంలో 419 రోడ్లకు మహర్దశ**

(మొదటిపేజీ తరువాయి)

ఇందులో కొత్తగా 30 రోడ్ల పనులకు ఆమోదం తెలిపారు. వీటి అంచనా వ్యయం సుమారు రూ.850.73 కోట్లుగా పేర్కొన్నారు. ఇప్పటికే మంజూరైన 7 పనులను విస్తరిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే ఆమోదించిన కొన్ని రోడ్లకు కేవలం వైడెనింగ్ కూడా చేయాలనే నూతన ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. వీటి వ్యయం రూ.299.20 కోట్లు కానుంది. కాగా గతంలో ప్రతిపాదించిన 11 రోడ్ల పనులు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వీటితో పాటు ముందు ఆమోదించిన 11 పనులను వివిధ కారణాల వల్ల ప్రభుత్వం రద్దు చేసింది. వీటి మొత్తం పొడవు 101.38 కిమీ, అంచనా వ్యయం రూ.132.34 కోట్లు. కాగా సవరించిన ప్రణాళిక ప్రకారం మొత్తం రోడ్ల సంఖ్య 419గా మారగా... మొత్తం పొడవు: 5824.27 కి.మీ. అంచనా వేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కవర్ చేస్తూ రోడ్ల కనెక్టివిటీ, రోడ్ల నాణ్యత మెరుగుపరచడంపైనే ప్రధాన దృష్టి పెట్టనున్నామని ప్రభుత్వం తెలిపింది.

# శాంతించిన నాగార్జున

**కొండా సురేఖపై కేసు విత్ డ్రా.. మంత్రి క్షమాపణ చెప్పడంతో నిర్ణయం**

అయితే ఇటీవల మంత్రి సురేఖ తన వ్యాఖ్యల పట్ల క్షమాపణ తెలియజేయడంతో, నాగార్జున గురువారం కోర్టులోని ఆ డిఫమేషన్ కేసును విత్ డ్రా చేసుకున్నారు. దీంతో అక్కినేని ఫ్యామిలీకి, మంత్రి సురేఖకు మధ్య నెలకొన్న ఈ వివాదం పూర్తిగా ముగిసినట్లయింది.

**మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఇవే..**

కేటీఆర్, తనను రెచ్చగొట్టేవిధంగా మాట్లాడడంతో తాను భావోద్వేగానికి గురై నాగార్జున కుటుంబం మీద విమర్శలు చేయాల్సి వచ్చిందని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. " ఆ సందర్భంలో నాకు ఇంకెవరి మీద కూడా వ్యక్తిగత ద్వేషం గాని మరి వ్యక్తిగత కోపం గాని లేదు అనుకొని ఆ సందర్భంలో కొన్ని ఒక కుటుంబం మాట నేను తీయడం ఏదైతే ఉందో అది అనుకోకుండా నా నోటి నుంచి రావడం జరిగింది. ఆ తర్వాత వారి ట్వీట్ చూసిన తర్వాత నేను కూడా చాలా బాధపడ్డాను. ఎందుకంటే ఏ విషయంలో నేనైతే బాధపడతా ఉన్నానో ఆ విషయంలో నేను ఇంకొకరిని నొప్పించాను అని తెలిసి రాత్రి వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటూ నేను ట్వీట్ చేయడం జరిగింది. కాబట్టి నాకు జరిగిన అవమానం నేను పడ్డ బాధ ఇంకొకరు పడకూడదు అనే ఒక ఆలోచనతో నేను బేశరత్గా దాన్ని వెనక్కి తీసుకోవడం జరిగింది." అని అన్నారు.



# జూబ్లీహిల్స్‌లో రిగ్గింగ్ జరిగింది

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ చేశాయి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్ర రావు

**హైదరాబాద్, మహా :** జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్ర రావు సంచలన కామెంట్స్ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ , బీఆర్ఎస్ రెండు పార్టీలు రిగ్గింగ్ పాల్పడ్డాయని ఆయన ఆరోపించారు. రెండు పార్టీలు పెద్ద ఎత్తున డబ్బులు పంచి దొంగ ఓట్లు వేయించారన్నారు. అయినా జూబ్లిహిల్స్ లో గెలుస్తామనే నమ్మకంతో ఉన్నామని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఎగ్జిట్ పోల్స్ ను పట్టించుకోవలసిన అవసరం లేదని, జూబ్లీహిల్స్ ప్రజలు బీజేపీ కి మద్దతుగా ఉన్నారన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేపై అనర్హత వేటు

**..హైకోర్టు సంచలన తీర్పు**

**కోల్ కతా:** పశ్చిమ బెంగాల్ లో పార్టీ మారిన టీఎంసీ ఎమ్మెల్యే ముకుల్ రాయ్‌కు బిగ్ తగిలింది. కోల్‌కతా హైకోర్టు ఆయన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. ఇక వివరాల్లోకి వెళ్తే.. 2021లో పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ పార్టీ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన సంగతి తెలసిందే. ఆ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ముకుల్ రాయ్.. అదే ఏడాది ఆగస్టులో బీజేపీలో చేరారు. దీనిపై బీజేపీ నేత సువెందు అధికారి, మరో బీజేపీ ఎమ్మెల్యే అంబికా రాయ్.. ముకుల్ రాయ్ పార్టీ మారడంపై హైకోర్టును ఆశ్రయించారు. ఆయన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ కోరారు. దీనిపై తాజాగా విచారణ జరిపిన హైకోర్టు.. ముకుల్ రాయ్‌పై అనర్హత వేటు వేసింది. బీజేపీ టికెట్ నుంచి గెలిచిన ఆయన చట్టవిరుద్ధంగా పార్టీ మారాడంటూ పేర్కొంది. యాంటీ డిఫెక్షన్ చట్టం కింద ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసింది. దేశ చరిత్రలో హైకోర్టు ఎమ్మెల్యేపై అనర్హత వేటు విధించడం ఇదే మొదటిసారి కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. కోర్టు ఇచ్చిన తీర్పును అక్కడి బీజేపీ నేతలు స్వాగతిస్తున్నారు.

# రూ. 11,399.33 కోట్లతో రోడ్ల పనులు

(మొదటిపేజీ తరువాయి)

ఆయన ప్రభుత్వ సలహాదారు మాత్రమే కాదు - జిల్లాకు వాస్తవిక మంత్రి అని పేర్కొన్నారు. ఏ పని మొదలు పెడితే అకుంఠిత దీక్షతో పూర్తి చేసే క్రమశిక్షణ ఆయనలో ఉన్నదని చెప్పారు.

**ప్రజాధనాన్ని కాళేశ్వరం పేరుతో..**

వ్యాపారం, రాజకీయం రెండింటిలోనూ విజయవంతమైన ప్రయాణం కొనసాగిస్తున్నారని వెల్లడించారు. మెడికల్ కాలేజ్, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్, కెనాల్ ఆధునీకరణలో సుదర్శన్ రెడ్డిది కీలక పాత్ర ఉందని ప్రశంసించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులను అటకెక్కించిందని, ప్రజాధనాన్ని కాళేశ్వరం పేరుతో గోదావరిలో పోసిన ఘనత కేసీఆర్‌దే అని విమర్శించారు. దేశంలోనే తొలిసారి తెలంగాణలో సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయమని వివరించారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేసి కాంగ్రెస్ పార్టీ మాట నిలబెట్టుకున్న ఉదాహరణ అని అన్నారు. 35 ఏళ్ల నిరీక్షణకు తెరదించి ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్‌దని, అగ్రికల్చర్ కళాశాల త్వరలో యూనివర్సిటీలో శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే కరీంనగర్ - బాసర రోడ్డు అభివృద్ధికి రూ. 350 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. భీమ్గల్ లింబాద్రి గుట్ట ఆలయంలో టూరిజం గెస్ట్ హౌస్ కోసం రూ. 4 కోట్లు మంజూరయ్యాయని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## కనీస సౌకర్యాల్లేవ్... ఇష్టమొచ్చినట్లు రేట్లు పెంచేస్తారా?

### భక్తుల ఇబ్బందులను పట్టించుకోరా?

కొండగట్టులో ఆర్జిత సేవా రుసుంను పెంచడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం

**కరీంనగర్, మహా :** కొండగట్టు దేవస్థానంలో ఆర్జిత సేవా రుసుంను భారీగా పెంచడం పట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండగట్టు ఆలయంలో కనీస సౌకర్యాల్లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, సౌకర్యాల మీద దృష్టి సారించాల్సిన అధికారులు వాటిని విస్మరించడమే కాకుండా ఆర్జిత సేవా రుసుం పేరుతో అడ్డగోలుగా ధరలు పెంచడమేంటని ప్రశ్నించారు. గురువారం ఉదయం దేవాదాయ శాఖ అధికారులతో బండి సంజయ్ ఫోన్ మాట్లాడుతూ కొండగట్టులో ఆర్జిత సేవా రుసుం పెంపుపై అసహనం వ్యక్తం చేశారు. ''కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాల్లేవు. తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ టైంలో కనీస సౌకర్యాలపై దృష్టి సారించకుండా అడ్డగోలుగా ఆర్జిత సేవా రుసుంను పెంచడమేంటి?''అని ప్రశ్నించారు. తక్షణమే ఆర్జిత సేవా రుసుంను తగ్గించాలని సూచించారు. అట్లాగే కొండగట్టు దేవస్థానంలో కనీస సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టి భక్తులకు ఇబ్బందులను తొలగించాలని కోరారు.

## 1.77 కి.మీ పొడవుతో కృష్ణానదిపై ఐకానిక్ కేబుల్ వంతెన

### సోమశిల, సిద్ధేశ్వరం మధ్య నిర్మాణం.. అంచనా వ్యయం రూ.1083 కోట్లు

**హైదరాబాద్, మహా :** తెలంగాణఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ కృష్ణానదిపై ఐకానిక్ కేబుల్ వంతెన అందుబాటులోకి రానుంది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి వేగంగా సన్నాహాలు జరుగుతున్నాయి. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉన్న సోమశిల వద్ద నిర్మించనున్న ఈ భారీ ప్రాజెక్టు కోసం భూ సేకరణ, టెండర్ల ప్రక్రియ దాదాపు పూర్తి కావడంతో త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. జాతీయ రహదారుల సంస్థ (ఎన్ హెచ్ఏఐ) అధికారులు ఈ ప్రాజెక్టును మూడో ప్యాకేజీలో చేపట్టనున్నారు. మొత్తం 1.77 కిలోమీటర్ల పొడవున ఈ కేబుల్ వంతెనను నిర్మించనున్నారు. నిర్మాణ వ్యయం సుమారు రూ. 1083 కోట్లుగా అంచనా వేశారు. శ్రీశైలం జలవిద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో సుమారు 117 గ్రామాలు, లక్షలాది ఎకరాల భూమి ముంపునకు గురైంది. అప్పటి నుంచి ఈ రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కొల్లాపూర్ (సోమశిల) తీరానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందికొట్కూర్ పరిధిలోని సిద్ధేశ్వరం గుట్టల మధ్య ప్రయాణించడానికి ప్రజలు పడవలు, పుట్టీలపై ప్రమాదకరంగా నదిని దాటాల్సి వస్తోంది. ఈ ప్రమాదకర ప్రయాణంలో చాలామంది ప్రాణాలు కోల్పోవడం తీర గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. ఈ కేబుల్ వంతెన నిర్మాణంతో ఈ శాశ్వత రాకపోకల సమస్య పూర్తిగా తీరిపోతుంది.

టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నందున అధికారులు వచ్చే ఏడాది జనవరిలో నిర్మాణ పనులను అధికారికంగా చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వంతెన నిర్మాణంలో భాగంగా సోమశిల, సిద్ధేశ్వరం గుట్టల వైపు అడుగుభాగంలో 70 మీటర్ల ఎత్తులో, నదీ ప్రవాహం పైన సుమారు 100 మీటర్ల ఎత్తులో పిల్లర్ల నిర్మాణం



చేపట్టనున్నారు. ఇది కేవలం రవాణాకే కాకుండా, ఒక పర్యాటక ఆకర్షణీయ కేంద్రంగా కూడా అభివృద్ధి చెందుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వంతెనతో పాటుగా, రెండు వైపులా అప్రోచ్ రహదారుల నిర్మాణం కూడా కీలకమైనది. ఈ అప్రోచ్ రహదారి మొత్తం పొడవు 13 కిలోమీటర్లుగా నిర్ణయించగా దీని కోసం రూ. 460 కోట్లు నిధులు కేటాయించారు. కొల్లాపూర్ మండలం వరిదేల రెవెన్యూ శివారు నుంచి సోమశిల గుట్ట వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర అప్రోచ్ రోడ్డు నిర్మించడానికి సోమశిల, చెన్నంపల్లి, పెంట్లవెల్లి, మల్లేశ్వరం శివార్ల పరిధిలో మొత్తం 25 హెక్టార్ల అటవీభూమి, 28 హెక్టార్ల రెవెన్యూ మరియు పట్టా భూములను సేకరించారు. సిద్ధేశ్వరం గుట్ట నుంచి కపిలేశ్వరం, నందికొట్కూరు అటవీ ప్రాంతంలో సుమారు 5 కిలోమీటర్ల మేర అప్రోచ్ రహదారి కోసం 25 హెక్టార్ల మేర భూసేకరణ పూర్తయింది. ఈ వంతెన పూర్తి అయితే ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య దూరం తగ్గడంతో పాటు ఆర్థిక భారం తగ్గి, శాశ్వతంగా రాకపోకల సమస్య తీరుతుందని తీర గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది రెండు రాష్ట్రాల మధ్య వాణిజ్యం, పర్యాటక రంగాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు చెబుతున్నారు.

## ఢిల్లీ పేలుడు ఘటన

### అల్ ఫలా విశ్వవిద్యాలయానికి న్యాక్ షోకాజ్ నోటీసులు

పేలుడు ఘటనలో అనుమానితులుగా ఉన్న విశ్వవిద్యాలయానికి చెందిన వైద్యులు




ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడు ఘటనలో అల్ ఫలా విశ్వవిద్యాలయానికి చెందిన కొందరు వైద్యులు అనుమానితులుగా ఉండటంతో ఈ విశ్వవిద్యాలయానికి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అల్ ఫలా విశ్వవిద్యాలయం తమ వెబ్‌సైట్‌లో గుర్తింపునకు సంబంధించి తప్పుడు సమాచారం పొందుపరిచినందుకు న్యాక్ ఈ చర్య తీసుకుంది. న్యాక్ గుర్తింపు లేకుండా, లేదా అక్రిడేషన్ కోసం దరఖాస్తు చేసుకోకుండానే, అల్ ఫలా విశ్వవిద్యాలయం తమ కళాశాలకు గుర్తింపు ఉన్నట్లుగా వెబ్‌సైట్‌లో బహిరంగంగా ప్రదర్శించిందని, ఇది పూర్తిగా తప్పని న్యాక్ తన నోటీసుల్లో పేర్కొంది. ఈ చర్య ప్రజలను, ముఖ్యంగా తల్లిదండ్రులను, విద్యార్థులను తప్పుదారి పట్టించడమేనని తెలిపింది. హర్యానాలోని ఫరీదాబాద్ జిల్లా ధౌజ్ గ్రామంలో 76 ఎకరాల్లో అల్ ఫలా విశ్వవిద్యాలయం విస్తరించి ఉంది. హర్యానా ప్రైవేటు యూనివర్సిటీల చట్టం కింద ఇది ఏర్పాటైంది. 1997లో ఇంజినీరింగ్ కాలేజీగా మొదలైన ఈ సంస్థ, 2013లో యూజీసీకి చెందిన న్యాక్ నుంచి 'ఏ' గ్రేడ్ అందుకుందని కొన్ని మీడియా కథనాలు పేర్కొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2014లో దీనికి విశ్వవిద్యాలయ హోదా కల్పించింది. ఈ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 2019లో అల్ ఫలా మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. తమది గుర్తింపు పొందిన విద్యా సంస్థ అని విశ్వవిద్యాలయం విడుదల చేసిన ప్రకటనలో కూడా పేర్కొంది. ఈ నేపథ్యంలో న్యాక్ నుంచి నోటీసులు రావడం గమనార్హం.

## మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

### కౌలు రైతుల మక్కలను ప్రభుత్వమే కొనాలి.. సీఎంకు లేఖ రాసిన బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**హైదరాబాద్, మహా :** మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, కౌలు రైతులు పండించిన మొక్కలను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని బీజేపీ ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, జిల్లాల పరిధిలో 3.20 లక్షల మంది రైతులు సాగు చేసారని, ఇందులో కొంతమంది కౌలు రైతులు మొక్కజొన్నలను పండించారని పేర్కొన్నారు. క్రాప్ సర్వేలో పంట నమోదు కాలేదన్న కారణంతో మార్కెట్ యార్డ్ కు తెచ్చిన మక్కలను కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో రైతుల శ్రమను దళారులు దోచుకుంటున్నారని తెలిపారు. కౌలు రైతులు దళారులకు రూ. 1700కు అమ్ముకోవడం జరుగుతుందన్నారు. 'ప్రతీ ఎకరానికి 18 క్వింటాళ్లు మాత్రమే మక్కలు కొంటాం అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కోతలు పెడుతున్నారు. పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి. క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధరతో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెల్లిస్తామన్న రూ. 330 బోనస్ ను రైతులకు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అడ్డికి పావుశేరు చొప్పున రైతులు అమ్ముకునే దుస్థితి ఏర్పడింది. మక్క రైతులకు తీవ్ర నష్టం వాటిల్లి వారి కష్టమంతా దళారుల పాలవుతున్నది. మొక్కజొన్నకు కనీస మద్దతు ధర క్వింటాల్ కు 2400 రూపాయలు కౌలు రైతులు పండించిన పంటలను కూడా మద్దతుధర అందించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలనీ డిమాండ్ చేస్తున్నాం' అని ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్ చేశారు.

# బస్సులు పెంచండి

## ఆర్టీసీ సమీక్షలో మంత్రి పొన్నం ఆదేశం

- ఆదాయ పెంపుపై అవకాశాలు అన్వేషించాలని సూచన
- నగర విస్తీర్ణానికి అనుగుణంగా బస్సు రూట్ లు పెంచాలని ఆదేశం
- కారుణ్య నియామకాల ప్రొవిజన్ పిరియడ్ ను 2 సంవత్సరాలకు తగ్గించాలని ఆదేశం
- నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపో లపై ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు నిర్ణయం



**హైదరాబాద్, మహా :** మహాలక్ష్మీ పథకం అమలు తర్వాత సంక్షోభంలో ఉన్న ఆర్టీసీ క్రమక్రమంగా లాభాల బాటలోకి వస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి నెల వారిగా వస్తున్న మహాలక్ష్మి టికెట్ ఆదాయమే కాకుండా అదనపు ఆదాయంపై దృష్టి సాధించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉన్నతాధికారులను ఆదేశించారు. గురువారం ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్ష జరిపిన మంత్రి ఆర్టీసీలో ఇప్పటి వరకు మహిళలు 237 కోట్ల జీరో టికెట్ ఉపయోగించుకున్నారని, ఫలితంగా ఆర్టీసీకి ప్రభుత్వం రూ. 7980 కోట్లను చెల్లించిందని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. టికెట్ ఆదాయంతో పాటు టికటేతర ఆదాయంపై దృష్టి సారించాలని మంత్రి ఈ సందర్భంగా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్టీసీ బస్సులు, బస్ స్టేషన్ లలో టిమ్ మిషన్ ల ద్వారా వచ్చే టికెట్ పై అడ్వర్టైజ్మెంట్స్ ద్వారా ఆదాయాన్ని మరింత పెంచాలని సూచించారు. ప్రస్తుతం నష్టాల్లో కొనసాగుతున్న తాండూరు, వికారాబాద్, బీహెచ్ఈఎల్, మియాపూర్, కుషాయిగూడ, దిల్ సుఖ్ నగర్, హకీంపేట్, రాణిగంజ్, మిధానితో పలు డిపోలు నష్టాల బారిన ఉండడానికి గల కారణాలు, స్థానిక పరిస్థితులు ఆయా డిపోలు లాభాల బాట పట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయడానికి ప్రత్యేక కమిటీ వేయాలని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని మంత్రి ఆదేశించారు. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుకునేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను కోరారు. నగరంలో ఇప్పటికే 500 వరకు ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నందున పీఎం ఈ డ్రైవ్ కింద హైదరాబాద్ కి కేటాయించిన 2 వేల బస్సులు విడతల వారిగా రానుండడంతో అందుకు సంబంధించిన చార్జింగ్ స్టేషన్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. నగరంలో పెరుగుతున్న కొత్త కాలనీలకు రవాణా సౌకర్యాలు కల్పించడానికి డిమాండ్ కు అనుగుణంగా కొత్త రూట్ లలో బస్సులు నడిపించేలా స్థానిక డీఎం ఇతర ఆర్టీసీ అధికారులతో ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఒక నివేదిక ను రూపొందించి బస్సులు నడిపేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 578 బస్సులు కొత్తగా రాష్ట్రంలో రోడ్డెక్కాయని, త్వరలో మరిన్ని కొత్త బస్సులు రానుండడంతో వాటిని ప్రయాణికుల ట్రాఫిక్ ఎక్కువగా ప్రాంతాల్లో నడిపించాలని సూచించారు.

ఇప్పటికే ఆర్టీసీ లో 1000 ఆర్టీసీ డ్రైవర్లు ,743 శ్రామిక్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటర్వ్యూ దశలో ఉండడంతో నియామకాలు వేగంగా పారదర్శకంగా జరిగేలా పూర్తి చేయాలని తెలిపారు. వచ్చే డిసెంబర్ చివరిలోపు 84 ట్రాఫిక్ సూపర్ వైజర్ ట్రైనీ, 114 సూపర్ వైజర్ ట్రైనీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ నియామక ప్రక్రియ టీజీపీఎస్సీ లేదా పోలీస్ బోర్డు ద్వారా నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కారుణ్య నియామకాల కింద చేరిన ఆర్టీసీ కండక్టర్లకు ఉన్న మూడు సంవత్సరాల ప్రొవిజన్ రెండు సంవత్సరాలకు తగ్గించేలా పరిశీలించాలని అధికారులకు సూచించారు.

**మేడారం జాతర లోపల ములుగు డిపో పూర్తి కావాలి**

మేడారం జాతర సమీపిస్తుండటంతో ములుగు బస్ స్టేషన్ నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. డిసెంబర్ లోపు స్లాబ్ పనులు పూర్తి చేయాలని జాతర సమీపిస్తుండటంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం, పెద్దపల్లి జిల్లా బస్సు డిపో పనుల పురోగతిపై ఈసందర్భంగా మంత్రి అధికారుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. పుష్కరాల లోపు మంథని బస్ స్టేషన్ ఆధునీకరణ పూర్తి కావాలని ఆదేశించారు. మధిర బస్ స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని, హుజూర్ నగర్, కోదాడ బస్ స్టేషన్ ల శంకుస్థాపన వారం రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. మిర్యాలగూడ అప్ గ్రేడేషన్ పనులు ప్రారంభించాలని తెలిపారు.

**ఫోర్త్ సిటీలో బస్ స్టేషన్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఫోర్త్ సిటీ లో బస్ టెర్మినల్ నిర్మాణం , బస్ సౌకర్యాల పై ఆర్టీసీ ఉన్నతాధికారులు అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో పెరుగుతున్న జనాభాకి అనుగుణంగా కొత్త డిపోలకు అవసరమైన స్థల పరిశీలన చేసి జిల్లా కలెక్టర్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వానికి అందించాలని తెలిపారు. నగరంలో నలువైపుల బస్ స్టేషన్ లు ఉండేలా జెబిఎస్ మాదిరి ఆరంఘర్ లో అధునాతన బస్సు టెర్మినల్ నిర్మించడానికి ఆర్టీసీ ,పోలీస్ శాఖ కి సంబంధించిన భూ బదలాయింపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఉప్పల్ లో మరో బస్ టెర్మినల్ నిర్మించడానికి అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. రవాణా శాఖ సీజ్ చేసిన వాహనాలు బస్సు డిపో లో చాలా కాలంగా పేరుకుపోవడంతో వారికి సమయం ఇచ్చి యాక్షన్ వేయాలని సూచించారు. ఆర్టీసీలో ప్రమాదాలను తగ్గించడానికి తొలి దశలో లహరి , రాజధాని , గరుడ బస్సుల్లో అమలవుతున్న డ్రైవర్ మానిటరింగ్ సిస్టం ను పని తీరును అడిగి తెలుసుకున్నారు . దీని ద్వారా డ్రైవర్ నిద్ర ఉపక్రమించే సూచనలు కానీ ,మొబైల్ వాడుతున్నప్పుడు మానిటరింగ్ చేస్తూ అప్రమత్తం చేస్తుంది. ఇక ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్ లకు నిరంతరం శిక్షణ ప్రతి బస్సు కి ఇద్దరు డ్రైవర్లు తప్పనిసరి నిర్ణయాన్ని కఠినతరం చేయాలని పేర్కొన్నారు. డ్రైవర్లకు నిరంతరం మెడికల్ టెస్ట్ నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే ఆర్టీసీ ఉద్యోగులతో జూమ్ సమావేశం నిర్వహిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఇది విజయవంతం అయితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బస్సుల్లో అమలు చేసేలా కార్యాచరణ తీసుకోవాలని ఆదేశించారు. తార్నాక హాస్పిటల్ లో రోగుల బంధువుల కోసం ఏర్పాటు చేస్తున్న డార్మిటరీ రూంను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ ఫంక్షన్ హాల్ లు వస్తున్న ఆదాయం ఖర్చులు వివరాల పై ఆరా తీశారు. దీని ద్వారా మరింత ఆదాయం పెంచుకోవాలని సూచించారు.

**మహిళా సంఘాల ద్వారా మరో 450 బస్సుల సేకరణ**

ఆర్టీసీ మహిళా సంఘాలు ద్వారా 600 బస్సులు అద్దె ప్రాతిపదికన నడిపించాలని సెర్ప్ తో ఒప్పందం చేసుకుంది . ఇప్పటి వరకు 150 బస్సులు మహిళా సంఘాలు ఆర్టీసీ తో సంయుక్తంగా నడుస్తున్నాయి. మిగిలిన 450 బస్సులు కూడా మహిళా సంఘాల ద్వారా తీసుకోవాలని ఆదేశించారు. గత ఏడాది మేడారం జాతర కోసం 3490 బస్సులు నడపగా 16.83 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ లో ప్రయాణించారు. ఈసారి జాతర కు 20 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ లో ప్రయాణిస్తారని అంచనా వేస్తూ 3800 బస్సులు నడపడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు.

**నిరుద్యోగులకు గుడ్‌న్యూస్**

నిరుద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. డిసెంబర్‌లో మరో జాబ్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఆర్టీసీలో 1000 డ్రైవర్లు,743 శ్రామిక్ పోస్టులకు నోటిషికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో వీటిని భర్తీ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూ దశలో ఉన్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఈ నియామకాలు వేగంగా, పారదర్శకంగా జరిగేలా చూస్తామన్నారు. అలానే వచ్చే నెల అనగా డిసెంబర్ చివరి నాటికి మరో నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి పొన్నం ప్రకటించారు.

## ప్రపంచ పెట్టుబడిదారులకు హైదరాబాద్ ఉత్తమ గమ్యస్థానం

- అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దడమే ప్రాధాన్యం
- యూఎస్ఐఎస్ పీఎఫ్ వార్షిక సమ్మిట్‌లో సీఎం రేవంత్ రెడ్డి
- సమ్మిట్‌లో తెలంగాణరైజింగ్ 2047 విజన్ ప్రదర్శన
- సీఎం విజన్‌పై ప్రశంసలు కురిపించిన టెక్ దిగ్గజాలు



**ఢిల్లీ, మహా :** అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉన్న హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని రేవంత్ అన్నారు. ఢిల్లిలో గురువారం జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలుభారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సు (యూఎస్ఐఎస్ పీఎఫ్) లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. తెలంగాణలో గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీలు ప్రభుత్వాలకు సారథ్యం వహించినా పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి వివరించారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారమని సీఎం తెలిపారు. జీసీసీలకు గ్యమస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని సీఎం రెడ్డి తెలిపారు. గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారుతుందన్నారు. మూసీ నది పునరుజ్జీవం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందన్నారు. డ్రైపోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్ - ట్రిబుల్ ఆర్ మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని వివరించిన ముఖ్యమంత్రి చైనా +1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుంది" అని అన్నారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల (గ్లోబల్ సౌత్) విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని సీఎం ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను ఆహ్వానించారు. భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నేతల పేర్లు ఉంటాయని... హైదరాబాదులో ఆ ట్రెండ్ ను మార్చాలని తాము అనుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ పేర్లను పెడతామన్నారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ను ప్రదర్శించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి లక్ష్యం ఢిల్లీలో జరిగిన యూఎస్ఐఎస్ పీఎఫ్ వార్షిక సమావేశంలో విశేష ఆదరణ పొందింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరించిన సీఎం ప్రసంగం, అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది.

## ఏపీలో కోరమండల్ ఎరువుల తయారీ ప్రాజెక్టు

- రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధత
- అన్న క్యాంటీన్లకు బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ రూ.1కోటి విరాళం
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో వివిధ సంస్థల ప్రతినిధుల భేటీలు

**విశాఖపట్నం, మహా :** విశాఖలో వివిధ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరుస భేటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని పెట్టుబడులకున్న అవకాశాలను వివరించడంతోపాటు పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తున్నారు. అలాగే ప్రతిపాదనలతో వచ్చిన వారితో ఈడీబీతో ఎంఓయూలు కుదుర్చుకోవాల్సిందిగా సూచిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ఎరువులు, అగ్రిఇన్‌పుట్ సంస్థ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రతినిధులతో సీఎంతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఎరువుల తయారీ విస్తరణ, గ్రీన్ అమోనియా, అగ్రిటెక్ ప్రాజెక్టులపై ఆ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. మురుగప్ప గ్రూప్‌కు చెందిన కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థకు ఇప్పటికే విశాఖపట్నం, కాకినాడలో ఎరువుల ఉత్పత్తి యూనిట్లు ఉన్నాయి. దీనికి కొనసాగింపుగా మరో రూ.2,000 కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో ఎరువుల తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు ఆ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు ముఖ్యమంత్రి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. గ్రీన్ అమోనియా గ్రీన్ హైడ్రోజన్ తయారీ, ఎరువుల ఉత్పత్తి యూనిట్ విస్తరణ సహా ఇంకొన్ని ప్రాజెక్టులపై కోరమండల్ సంస్థ పెట్టుబడులు పెట్టనుంది. మరోవైపు ప్రముఖ ఫర్నిచర్ సంస్థ బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ ఛైర్మన్ ఎన్‌కే అగర్వాల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు.

## మంగాపురం తండా అభివృద్ధికి రూ. 7.65 కోట్లు

- బుద్ధారం గ్రామాభివృద్ధికి రూ. 12.24 కోట్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వరాలు
- నేలకొండపల్లిలో పర్యటన.. సీసీ రోడ్ల శంకుస్థాపన, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ఖమ్మం, మహా:** రాష్ట్రంలో ప్రతి పేదింటికి వెలుగులు తెచ్చే దిశగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఆయన నేలకొండపల్లి మండలంలో పర్యటించి మంగాపురం తండా, బుద్ధారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మంగాపురం తండాలో రూ. 30 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి, గత 20 నెలల్లో రూ. 57 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామని తెలిపారు. మంగాపురం-నాచేపల్లి మధ్య రూ 4.50 కోట్లతో బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయని, రావిగూడెం-మంగాపురం తండా మధ్య రూ. 2.22 కోట్లతో బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయని వివరించారు. అదనంగా 7 లక్షలతో అంగన్‌వాడీ భవనం నిర్మాణం కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. మొత్తం మంగాపురం తండా అభివృద్ధికి రూ. 7.65 కోట్ల నిధులు మంజూరు చేశామని వెల్లడించారు.

**రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉంది..**


బుద్ధారం గ్రామంలో రూ. 26 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించామని, నేలకొండపల్లి-గంద్రాయి బీటీ రోడ్డు పై రూ.7 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పూర్తి చేశామని చెప్పారు. గత 22 నెలల్లో బుద్ధారం గ్రామాభివృద్ధికి మొత్తం రూ12.24 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. రెండు లక్షల వరకు పంట రుణమాఫీ పూర్తయిందని, రైతులకు మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ 500 బోనస్ అందిస్తున్నామని చెప్పారు. రైతు భరోసా కింద 9 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు.

**మూడు విడతల్లో ఇందిరమ్మ ఇండ్లు..**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్‌లో సన్నబియ్యం సరఫరా, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం పేదల గృహ నిర్మాణ పథకాలను విస్మరించిందని విమర్శించిన మంత్రి, ప్రజా ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేసిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ మూడు విడతల్లో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 58 మంది లబ్ధిదారులకు రూ. 20.29 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్
14-11-2025
WWW.MAHAADAILY.COM


# బీహారం ఎవరికి?




## పాటలీపుత్రలో అసలు పరీక్ష

### ఎగ్జిట్ పోల్స్ నిజమవుతాయా?

### ఎప్పటిలాగే తప్పుతాయా?

### ఢిల్లీని డిసైడ్ చేయనున్న బీహార్

(మహా ప్రత్యేకం)

బీహార్ ఎవరిది? బీహార్ చిత్రవిచిత్ర రాజకీయాలకు పేరు. కులసమీకరణలే కీలకంగా ఉన్న బీహార్ లో సగం సీట్లలో అగ్రవర్ణాలే పోటీచేయగా, ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఎన్డీఏ గెలుపును సూచిస్తున్నాయి. అయితే ఎగ్జిట్ పోల్స్ బీహార్ ప్రజల నాడిని అంచనా వేయడంలో ప్రతిసారీ బోల్తా కొడుతుండగా, ఈ సారి ప్రధాన సర్వేసంస్థలు, మీడియా సంస్థలు అమ్మో బీహార్ అని దూరంగా ఉన్నాయి. ఎగ్జిట్ పోల్స్ ప్రకటించిన వాటిలో మెజారిటీ సంస్థలు ఎన్డీఏదే మరోసారి అధికారం అని తేల్చిచెప్పగా, జన్ సురాజ్ అడ్రస్ గల్లంతేనని తేల్చాయి. తేజస్వీయాదవ్ బీహార్ కు మోస్ట్ పాపులర్ లీడర్ అయినా సీట్లు మాత్రం మ్యాజిక్ మార్క్ ను తాకవని చెబుతున్నారు. సర్వేలన్నీ ఫేక్.. ప్రజలు స్పష్టంగా మహాఘట్ బంధన్ వైపు నిలిచారని ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ అన్నారు. బీహార్ ప్రజల తీర్పు ఏంటో.. నితీష్ మరోసారి సీఎం అవుతారా? అన్నది శుక్రవారం తేలనుంది.



## ఎవరి లెక్కలు వారివే..

బీహార్‌లో ఈసారి పోరు నువ్వా-నేనా అన్నట్లుగా ఉంది. ఆర్జేడీకి 'ముస్లిం-యాదవ్'రూపంలో 32 శాతం బలమైన పునాది ఉండగా, ఎన్డీయేకు అగ్ర వర్ణాలు, లవ్-కుష్, దళిత, మహాదళిత వర్గాల రూపంలో విస్తతమైన మద్దతు ఉంది. అయితే, ఈ రెండు కూటముల తలరాతను మార్చే శక్తి మాత్రం 36 శాతం జనాభా ఉన్న ఈబీసీ వర్గాల చేతుల్లోనే ఉంది. గతంలో నితీశ్ వైపు నిలిచిన ఈ వర్గం, ఈసారి కుల గణన తర్వాత ఎటువైపు మొగ్గు చూపుతుంది? తేజస్వి యాదవ్ ఇస్తున్న 'అధికార వాటా 'హామీని నమ్ముతుందా? లేక నితీశ్ కుమార్ నాయకత్వం, మోదీ సంక్షేమ పథకాల వైపు నిలుస్తుందా? అన్నదే బిహార్ ఎన్నికల ఫలితాన్ని నిర్దేశించనుంది. శుక్రవారం ఈవీఎంలు తెరిస్తే ప్రజలు ఎటువైపు నిలిచారని తేలుతుంది.


## ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్ని సీట్లు రావాలి?

బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి, ఏదైనా పార్టీ లేదా కూటమికి 122 సీట్లు ఉండాలి. ప్రస్తుతం, బిహార్‌లో జేడీయూ, బీజేపీ భాగస్వామ్య పక్షాలుగా ఎన్డీఏ ప్రభుత్వం ఉంది. ఆర్జేడీకి చెందిన తేజస్వి యాదవ్ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. బీహార్ అసెంబ్లీలో బీజేపీకి 80 మంది ఎమ్మెల్యేలు, ఆర్జేడీకి 77 మంది, జేడీయూకి 45 మంది, కాంగ్రెస్‌కు 19 మంది ఎమ్మెల్యేలు గత అసెంబ్లీలో ఉన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టులెనినిస్ట్) (లిబరేషన్)కు 11 మంది ఎమ్మెల్యేలు, హిందూస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్)కు నలుగురు, ఇతర పార్టీలు, స్వంతంత్రులు కలిపి ఏడుగురు ఉన్నారు. ఈసారి ఈ లెక్కలు ఎలా ఉంటాయో చూడాలి.

## కులాలు.. సమీకరణాలు

అధికార ఎన్‌డీయేలోని బీజేపీ, జేడీయూ, ఎల్జేపీ(ఆర్‌వి), హామ్, ఆర్ఎల్ఎంల కూటమి... ప్రత్యర్థి ఓటు బ్యాంకును చీల్చడంతో పాటు, తమ సామాజిక వర్గాలను ఏకం చేసే పకడ్బందీ వ్యూహంతో బరిలోకి దిగింది. అందులో సఫలమైనట్లు ట్రెండ్స్ చెబుతున్నాయి. బీజేపీకి సంప్రదాయంగా అగ్ర వర్ణాల (15.4 శాతం) ఓటు బ్యాంకు ఉంది. కుల గణన తర్వాత, వారు కూడా తమ వ్యూహాన్ని మార్చి ఈబీసీ, ఓబీసీ వర్గాలకు అభ్యర్థుల జాబితాలో పెద్ద పీట వేస్తూ 'సోషల్ ఇంజనీరింగ్'చేశారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బలం 'లవ్-కుష్'(కుర్మి- 2.87 శాతం, కుష్వాహా/కోయిరి -4.2 శాతం) సమీకరణం. అన్నింటి కంటే ముఖ్యంగా, దశాబ్దాలుగా ఆయనను నమ్ముకున్న 36 శాతం ఈబీసీ ఓటు బ్యాంకే ఆయనకు శ్రీరామరక్షగా భావిస్తున్నారు. మిత్రపక్షమైన చిరాగ్ పాశ్వాన్ దళితులలో బలమైన వర్గమైన దుసాధ్ ఓట్లను (సుమారు 5.5 శాతం) ఎన్డీయే వైపు తిప్పడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. జితన్ రామ్ మాంఝీ పార్టీ ప్రధానంగా మహాదళితుల (ముఖ్యంగా ముసహర్- 3 శాతం) ఓట్లను కూటమికి అందివ్వనుండగా, ఉపేంద్ర కుష్వాహా (ఆర్ఎల్ఎం): 'లవ్-కుష్'స మీకరణంలోని కుష్వాహా ఓట్లను మరింత గట్టిగా ఏకీకృతం చేయనున్నారు. ఇవన్నీ అనుకున్నట్లుగా వర్కవుట్ అయ్యాయన్న అంచనాలో ఎన్డీఏ ఉంది.

## అంచనాలకు భిన్నంగా బీహార్ ఎగ్జిట్ పోల్స్



బీహార్ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలన్నీ.. ఇపుడు ఎన్డీయేకే మొగ్గు చూపాయి. అయితే.. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ తేజస్వి యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ కూటమి గెలుస్తుందని అంచనా వేశాయి. కానీ, ఫలితాలు వచ్చినప్పుడు ఎన్డీయే స్వల్ప మెజారిటీతో అధికారాన్ని నిలబెట్టుకుంది. అంటే సీన్ రివర్స్ అయింది. అంతకుముందు కూడా ఇలాగే జరిగింది. గత ఎన్నికల్లో ఎన్డీయే 125 సీట్లు గెలుచుకోగా, మహాకూటమి 110 సీట్లకు పరిమితమైంది. ఆర్జేడీ మాత్రం అత్యధికంగా 75 సీట్లు గెలుచుకుని సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు, వాస్తవ ఫలితాలకు.. పెద్ద తేడా వచ్చింది. ఈసారి కూడా ఎన్నికలు హోరాహోరీగా సాగడంతో, చివరి నిమిషంలో ఓటర్ల నిర్ణయం.. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు భిన్నంగా ఉండొచ్చనే ఆశ మహాఘట్‌బంధన్ క్యాంప్‌లో ఇప్పటికీ ఉంది. ఏదేమైనా, ఈ ఎన్నికల్లో తేజస్వి యాదవ్ ఓ రైజింగ్ స్టార్‌గా నిలిచారు. ఆయన జీవితంలో.. 2025 బీహార్ ఎన్నికలు.. ఓ కీలకమైన టర్నింగ్ పాయింట్‌గా నిలిచాయ్. బీహార్ పాలిటిక్స్‌లో.. నితీశ్ కుమార్ తర్వాత అంతటి బలమైన, ప్రజలను ఆకట్టుకోగల నేతగా తేజస్వి తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ముఖ్యంగా.. యువతని ఆకట్టుకోవడంలో తేజస్వి సక్సెస్ అయ్యారు. ప్రధానంగా ఉద్యోగ, ఉపాధి కల్పన అస్త్రంతో జనంలోకి వెళ్లారు. బీహార్ యువత, ముఖ్యంగా నిరుద్యోగులు భారీ ఎత్తున.. తేజస్వి యాదవ్ ప్రచారానికి తరలివచ్చారు. తాము అధికారంలోకి వస్తే 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామనే హామీ.. ఓ గేమ్ ఛేంజర్‌గా మారింది. తేజస్వి యాదవ్.. మహాఘట్‌బంధన్ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా దాదాపు ఒంటరి పోరాటాన్ని నడిపించారు. నితీశ్ కుమార్, ప్రధాని మోదీ లాంటి అగ్ర నేతల ఉమ్మడి శక్తిని ఎదుర్కొని కూడా ప్రచారంలో బలంగా నిలబడ్డారు. చాలా చోట్ల గట్టి పోటీ ఇచ్చారు. ఫలితం చూడాలి.

## ఎగ్జిట్ పోల్స్ అంచనా



## పట్నంలో ఫిజియోథెరపీ సెంటర్ ప్రారంభించిన అభిషేక్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నంలో ఫిజియోథెరపీ సెంటరును, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం కేంద్రంలో, (సహదేవరెడ్డి గల్లి) చైతన్య హాస్పిటల్, లిమ్స్ హాస్పిటల్, కొత్త బస్టాండ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన, సరిత ఫిజియోథెరపీ సెంటరును మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, డాక్టర్ సరిత సురేష్ కుమార్ ప్రారంభించారు. సామాన్యులకు అందుబాటులో ఉండేలా, అత్యాధునిక వైద్య పరికరాలతో, అనుభవజ్ఞులైన టెక్నీషియన్ తోఫి జియోథెరపీ సెంటరును, రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, బస్టాండ్ ఎదురుగా సహదేవరెడ్డి గల్లీలో, లిమ్స్ హాస్పిటల్ పక్కన నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది. వైద్యం కోసం వచ్చే రోగులకు ఉదయం 9 నుండి రాత్రి ఏడు వరకు అందుబాటులో ఉండడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పిఏసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ డి రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలరాజ్, కప్పరి చందు, బర్ల జగదీశ్వర్, కార్యకర్తలు ఫిజియోథెరపీ సెంటర్ నిర్వాహకులు, కుటుంబ సభ్యులు పలువురు హాజరయ్యారు.

## నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, పనులు త్వరగాతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి

**కార్పొరేటర్ తోకల**



**రాజేంద్రనగర్, మహా :** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ లో అభివృద్ధి పనులలో భాగంగా నూతన సీ సీ రోడ్డు పనులను గురువారం రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్ఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ లో సుమారు 25 లక్షల రూపాయల వ్యయంతో కొత్త సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నాం. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పించడమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. డివిజన్ పరిధిలోని జరుగుతున్న అభివృద్ధి పనులలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేసి డివిజన్ ప్రజలకు అందుబాటు లోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, తలారి చిన్న, బబ్లూ, ప్రభుదాస్, రామ రావు, ఆదిముల శేఖర్, మధుసూదన్ రెడ్డి, మధుసూదన్, శేఖర్ బాబు రావు, రెడ్డి శ్రీనివాస్, భాను రెడ్డి, దినకర్, పాండు రంగా రెడ్డి, శేఖర్, జీహెచ్ఎంసి సిబ్బంది బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం..

**కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ.. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ ఎమ్మార్వో బొమ్మ రాములు ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలో గురువారం 631 మంది లబ్ధిదారులు మొత్తం విలువ రూ. 6 కోట్ల 31 లక్షల 73 వేల 196 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భారాన్ని తొలగించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న భీంభరత్**



**మొయినాబాద్ మహా:** పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పామేన భీంభరత్ పేర్కొన్నారు. గురువారం మొయినాబాద్ మండల పరిధిలోని ఎత్బార్ పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న భీంభరత్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం భీంభరత్ మాట్లాడుతూ.. గతంలో ఇల్లు లేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని, ఇల్లు లేని నిరుపేదలను ప్రభుత్వం గుర్తించి వారికి మంజూరుచేయడం జరిగిందని తెలిపారు. పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో అతిపెద్ద కార్గో విమానం ల్యాండింగ్...




**రాజేంద్రనగర్ మహా ;** ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన కార్గో విమానాల్లో ఒకటైన ఆంటోనోవ్ ఎన్ 124 రుస్లాన్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం ల్యాండ్ అయింది. అత్యంత సామర్థ్యంగల అతిపెద్ద ప్రత్యేక నైపుణ్యాన్ని కలిగిన ఆధునిక సౌకర్యాలు, బలమైన కార్గో వ్యవస్థతో, ప్రపంచంలో అత్యంత క్లిష్టమైన రవాణా అవసరాలను కూడా సులభంగా అందించడానికి సిద్ధంగా అంటోనోవ్ కార్గో విమానం ఎన్ 124 ఉంటుంది. ఆంటోనోవ్ విమానం వస్తుందంటే శంషాబాద్ విమానాశ్రయంలో ఒక ప్రత్యేక ఉత్సాహమే ఉంటుంది. ఈ విమానం రావడాని శంషాబాద్ ఎయిర్పోర్ట్ సిబ్బంది స్వాగతిస్తున్నారు.

## మూసి బాపు ఘాట్ రోడ్డును పరిశీలిస్తున్నా... జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ నుండి మూసి బాపు ఘాట్ కు వెళ్లే రోడ్డును గురువారం జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్ నాగేందర్ గౌడ్, రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి తొ కలిసి పరిశీలించారు.

## కృత్రిమ ఇసుక తయారు చేస్తే చట్టపరమైన చర్యలు

**ఆమనగల్లు ఎస్. ఐ బి వెంకటేష్ హెచ్చరిక**



**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మండలంలో కృతిమ ఇసుక (ఫిల్టర్ ఇసుకను) తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్. ఐ బి వెంకటేష్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఆకుతోటపల్లి, గౌరారం, శెట్టిపల్లి గ్రామాలలో కృతిమ ఇసుక తయారు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం కృతిమ ఇసుక తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించి. జెసిబిల సాయంతో ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఫిల్టర్ నిర్వాహకులు ఇద్దరు పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఫిల్టర్ ఇసుక తయారీ, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్ ఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ రామ్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు

# విద్యార్థుల్లో మానసిక దృఢత్వాన్ని పెంపొందించాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;** విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల వృద్ధికి, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడానికే స్ఫూర్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అభిప్రాయపడ్డారు. గురువారం వరంగల్ నగర పరిధి రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన స్ఫూర్తి కార్యక్రమంలో కలెక్టర్ సత్య శారద, జిల్లా పరిషత్తు సీఈఓ,ఇంచార్జి డిఆర్డీఓ రామిరెడ్డి లతో కలసి హాజరైయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించి భవిష్యత్తులో వారు ఏం కావాలను కున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికి అనుగుణంగా క్రమశిక్షణతో ఇష్టపడి చదవాలన్నారు. ఈ సందర్భంగా మానసిక దృఢత్వాన్ని కల్పించే మూడు వీడియోలను ప్రదర్శించి అందులో ఉన్న నీతిని కలెక్టర్ విద్యార్థుల నుండి రాబట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు భయం వీడితే ఏదైనా సాధించగలరని జిల్లా స్థాయి లో పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని నింపే విధంగా ప్రేరణ కలిగిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యకరమైన పిల్లలను నిర్మించడానికి, శారీరక అభివృద్ధితో పాటు మానసిక అభివృద్ధిపై దృష్టి సారించి ఈ స్ఫూర్తి కార్యక్రమం ద్వారా నేడు దాదాపు 100 పాఠశాలల్లో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, విశ్రాంత ఉపాధ్యాయులు, వివిధ రంగాల నిష్ణాతులతో విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలు, పోటీతత్వం, అడ్డంకులు, సవాళ్లు, సమయం స్ఫూర్తి, ఒత్తిడిని జయించి సామర్థ్యాలు పెంపొందించుకోవడంపై వివరించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల తోపాటు రెసిడెన్షియల్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న స్ఫూర్తి కార్యక్రమాన్ని త్వరలో ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థుల్లో భయాన్ని తొలగించి తెలివిగా తీర్చి దిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. అంతకుముందు ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్, ఫిర్యాదుల పెట్టెలో ఫిర్యాదులను, మధ్యాహ్న భోజనం, రాగి జావా నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా ఫిర్యాదుల పెట్టెలో వేయాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా మెనూ పాటిస్తూ నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయురాలు వనజ, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, మహా :** చదువుతో పాటు క్రీడా రంగంలో రాణించడం ద్వారా అనేక ఉపాధి అవకాశాలు దక్కించుకోవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో గల మహాత్మా జ్యోతి బాపులే పాఠశాల, కళాశాలలో జరిగిన క్రీడా వార్షిక ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ చూపాలని సూచించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి క్రీడా విశ్వవిద్యాలయం ప్రారంభమవుతోందని, అదిలాబాద్, జాతర్ల, ఉట్నూర్‌లలో ఇప్పటికే క్రీడా పాఠశాలలు ఉన్నాయని గుర్తుచేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని సూచించారు. అలాగే ఐఐటి, నీట్, జెఈఈ వంటి పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రత్యేకంగా కోచింగ్ అందుబాటులో ఉందని తెలిపారు. అదనంగా, వసతి గృహాల్లో మెనూ, కాస్మోటిక్ చార్జీలను పెంచినట్టు కలెక్టర్ వివరించారు. వృద్ధులను ఓల్డ్ ఏజ్ హోమ్స్‌లో ఉంచకుండా గౌరవంగా చూసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడల్లో ఓడిన విద్యార్థులు నిరుత్సాహపడకుండా, వచ్చే పోటీల్లో విజయానికి కృషి చేయాలని సూచించారు.అనంతరం క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీనివాస్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గణేష్ జాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు

**ప్లాస్టిక్ విక్రయ దుకాణానికి రూ.50 వేల జరిమానా**

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**



**హన్మకొండ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ హెచ్చరించారు. గురువారం నగర పరిధి లోని పబ్లిక్ గార్డెన్ నయీం నగర్ విజయ్ పాల్ కాలనీ తదితర ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి సమర్థవంతం గా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు ఈ సందర్భం గా కమిషనర్ పబ్లిక్ గార్డెన్ (శంఖం)ఎదురుగా పైపు లైన్ ఏర్పాటు, నయీం నగర్ ప్రాంతం లో నిర్మిత డ్రైన్, విజయపాల్ కాలనీ లో నిర్మిత సి సి రోడ్డు పనులు పూర్తి చేసిన నేపథ్యం లో బిల్లు చెల్లింపు కోసం కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కాకతీయ యూనివర్సిటీ క్రాస్ ప్రాంతం లో సందర్శించిన క్రమం లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు గమనించిన కమిషనర్ సదరు షాపు యజమానికి జరిమానా విధించాలని ఆదేశించిన నేపథ్యంలో రూ.50 వేలు జరిమానా విధించడం జరిగిందని సి ఎం హెచ్ ఓ తెలిపారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ 120 మైక్రాన్ ల మందం కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ తో పాటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించడం,వినియోగించడం నిషిద్ధం అని బయోడిగ్రేబుల్ సంచు లను వినియోగించాలని నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం తో పాటు భారీ జరిమానాలు విధిస్తామని అతిక్రమిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని ఈ సందర్భం గా కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో డి ఈ సారంగం ఏ ఈ విజయ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్ట్ భూసేకరణలో జాప్యం జరగకూడదు

**ఎయిర్ పోర్టు రన్ వే కు సంబంధించిన భూ సేకరణను పరిశీలించిన వరంగల్ ఎంపీ, జిల్లా కలెక్టర్**



**వరంగల్ మహా;** ఓరుగల్లు ప్రజల విమానాశ్రయం కల త్వరలోనే నెరవేరబోతోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. గురువారం ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలసి మామునూర్ ఎయిర్ రన్ వే విస్తరణ పనులను పరిశీలించారు. సమర్థ నిర్వహణకు ఇరిగేషన్, ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నక్కల పల్లి చెరువు, గాడిపల్లి చెరువులతో పాటు ఎయిర్ పోర్ట్ కు వెళ్ళే రోడ్లను సందర్శించి పరిశీలించారు. ప్రస్తుత వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకొని ఎయిర్పోర్ట్ పరిధిలో చేపట్టబోయే నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సంబంధించి మామునూరు ఎయిర్పోర్ట్. భూ సేకరణకు సంబంధించిన పనుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులకు ఎంపీ సూచించారు. అనంతరం అధికారులు మ్యాప్ ద్వారా రన్ వే విస్తరణ పనులను ఎంపీకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో విమనాశ్రయం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మామునూరులో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్‌కు ప్రణాళిక రూపకల్పన చేయడం జరిగిందని అన్నారు. ప్రయాణికుల సేవలతో పాటు కార్గో సేవలను సైతం అందించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధానిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు పక్కనే ఉన్నందున ఎయిర్ పోర్ట్ సర్వీసులు ప్రారంభమైతే వరంగల్ ప్రగతి లో దూసుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ ఈఈ రాజేందర్, ఇరిగేషన్ డీఈ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ ఇక్బాల్ అహ్మద్, ఏఈ రాజశేఖర్, సర్వేయర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

# అందెశ్రీకి తెరవే నిర్మల్ శాఖ ఘన నివాళ్లు



నిర్మల్ , మహా : ప్రముఖ కవి, తెలంగాణ ఉద్యమకారుడు, రచయిత అందెశ్రీ కి తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా కవులు ఘనంగా అక్షర నివాళులు అర్పించారు. అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటని,వారి ఆత్మ శాంతించాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గురువారం నిర్మల్ పట్టణంలోని డాక్టర్ దామెర సాహితి కళా క్షేత్రంలో అందెశ్రీ చిత్ర పటానికి పూల మాలలు వేసి మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. అందెశ్రీ నిరుపేదగా జన్మించి, అవమానాలను ఎదుర్కొని, కన్నీటిని హృదయంలో దాచుకొని అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని జీవించిన గొప్ప రచయిత అని కొనియాడారు. సమాజాన్ని,వ్యక్తులను, శ్రమజీవులను పేదరికాన్ని అలవోకనం చేసుకొని ప్రజల పక్షాన నిలబడి రచనలు చేసిన గొప్ప కవని, తెలంగాణ ఉద్యమంలో తమ పాటల ద్వారా ఉద్యమాన్ని ఊ్రూతలుగించిన రచయితని అన్నారు. జయ జయహే తెలంగాణ జనని జయ కేతనం అని రాష్ట్ర గీతాన్ని రాసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయాడని, గంగ సినిమాకు నంది అవార్డును అందుకున్నారని గుర్తు చేసుకున్నారు. సమాజ ఆరోగ్యాన్ని కోరుకున్న కవి తన ఆరోగ్యాన్ని కాపాడుకోలేక పరమపదించడం విచారకరమని వక్తలు అన్నారు.

# రెండవ రాజధాని వరంగల్ కు బస్టాండ్ ఎక్కడ?

- వరంగల్ బస్టాండ్ లో బిజెపి నేతల పడవ ప్రయాణంతో నిరసన
- బస్టాండ్ నిర్మాణంలో నిర్లక్ష్యం ప్రభుత్వానిదా.. పాలకులదా?
- బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**వరంగల్ మహా;** సీఎం రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి అయిన కొండా సురేఖ, మాజీ సీఎం కేసీఆర్ లకు ఉచిత పడవ ప్రయాణం కల్పిస్తున్నాం అంటూ గురువారం వరంగల్ బస్టాండు నిర్మాణ పనులు నిలిచిపోయిన స్థలం స్విమ్మింగ్ పూల్ గా మారిన అతిపెద్ద నీటి గుంట లో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తో కలిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బిజెపి నేతలు నీటిలో పూలు చల్లుతూ చేసిన పడవ ప్రయాణం రాష్ట్రమంతా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా అక్కడికి విచ్చేసిన మీడియాతో జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మంత్రులకు, కాంట్రాక్టర్లకు కమిషన్ల పై ఉన్న శ్రద్ధ అభివృద్ధి మీద లేదని మండిపడ్డారు. గత బిఆర్ఎస్ పార్టీ, ప్రస్తుత అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పాలనలో వరంగల్ ప్రజలు బస్టాండ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హైదరాబాదు తర్వాత రెండవ రాజధానిగా ఈ రెండు పార్టీలు చెప్పుకునే నేతలు ఓరుగల్లు నగరంలో బస్టాండ్ లేకపోవడం సిగ్గుచేటు అని వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనుల్లో భాగంగా కూల్చిన స్థలంలో నిర్మాణం కొరకు తీసిన అతిపెద్ద గొయ్యి లో నీరు నిండి ప్రస్తుతం ఆ స్థలం ప్రమాదకరంగా మారిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే వరంగల్ బస్టాండ్ పేరుతో నయవంచన చేస్తే.. ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ అసమర్థతతో బస్టాండ్ నిర్మాణానికి నోచుకోవడం లేదని మండిపడ్డారు. చారిత్రక నగరమైన వరంగల్‌కు బస్టాండ్ నిర్మాణానికి ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో వరంగల్ ఆత్మగౌరవ పోరాటం మహా ధర్నా 2 పేరుతో బీజేపీ వరంగల్ బస్టాండ్ ఏర్పాటు ప్రాంతంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నాయకులకు ఉచిత పడవ ప్రయాణం అనే వినూత్న నిరసన కార్యక్రమం జిల్లా బిజెపి పార్టీ చేపట్టింది. రాష్ట్ర రెండో రాజధానిగా వరంగల్‌ను తీర్చిదిద్దుతామంటూ ప్రగల్భాలు పలుకుతున్న సర్కారు కనీసం వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనులను చేపట్టడం లేదంటూ మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే కొండా సురేఖ మంత్రిగా ఉన్నా పట్టించుకోకపోవడం ఆమె అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల ముందు అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కోట్ల రూపాయలతో ఆధునిక బస్టాండ్ నిర్మిస్తామంటూ ఇదిగో.. నమూనా బస్టాండ్ అంటూ మాయమాటలు చెప్పి ఉన్నదానిని కూల్చారని ఆ తర్వాత కనీసం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదన్నారు. పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న వరంగల్‌కు కనీసం బస్టాండ్ లేకపోవడం ఏంటని పర్యాటకులు ముక్కుమీద వేలు వేసుకుంటున్నారని వాపోయారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హృదయ్, అమృత్, స్మార్ట్ సిటీ వంటి ఎన్నో పథకాలకు భారీగా నిధులు కేటాయించి వరంగల్‌ను ప్రగతిదారిలో నడిపిస్తుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రం ఓరుగల్లు చరిత్రను భ్రష్టు పట్టిస్తున్నాయని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనులు ఒక్కఅడుగు ముందుకు పడకపోయినా ఇక్కడి బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎందుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రెండు పార్టీలకు ఓట్లు తప్ప వరంగల్ తూర్పు అభివృద్ధి పై కనీస పట్టింపులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల భూముల్ని కబ్జా చేయడంలో, సెటిల్‌మెంట్ పనుల్లో ఆ పార్టీల నేతలు బిజీగా ఉన్నారని ఆరోపిస్తూ ఇక వారికి ప్రజా సమస్యలు ఏం పడతాయంటూ ఎద్దేవా చేశారు. ఓరుగల్లు సమగ్రాభివృద్ధి, అస్థిత్వం, ఆత్మగౌరవం కోసం బీజేపీ పాటు పడుతుందన్నారు. ఓరుగల్లు అభివృద్ధి కోసం ఇక ఉద్యమాన్ని ఉధృతం చేసి ఉమ్మడి జిల్లా మంత్రులు, శాసనసభ్యుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్, మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జలగం రంజిత్ రావు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, జిల్లా, మండల పదాధికారులు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా మోర్చా తో పాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## స్వాముల నీటి సమస్యను పరిష్కరించిన కేవీఎం బ్రదర్స్

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలోని అమ్మపల్లి దేవాలయంలో ఉంటున్న అయ్యప్ప స్వాములు నీటి సమస్యతో పడుతున్న ఇబ్బందులను చూసి కేవీఎం బ్రదర్స్ కనకమామిడి విష్ణు, కడగమామిడి కిట్టు, కనకమామిడి శ్రీశైలం, కనకమామిడి రాములు, ప్రశాంత్ అమ్మపల్లి దేవాలయ ఆలయ ప్రాంగణంలో కేవీఎం బ్రదర్స్ వారి సొంత నిధులతో నూతన బోరు మోటర్ బిగించి అయ్యప్ప స్వాముల నీటి కొరతను తీర్చారు.నీటి కొరతను తీర్చిన కేవీఎం బ్రదర్స్కు అమ్మపల్లి ఆలయ స్వాములు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో శేఖర్ చారి గురుస్వామి, నవీన్ గురుస్వామి, రాజు గురుస్వామి, ప్రభాకర్ గురు స్వామి, బాబు గురుస్వామి, ప్రకాష్ గురు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



## ఏసీబి వలలో ఆదిభట్ల టౌన్ ప్లానింగ్ అధికారి

**లంచం తీసుకుంటూ ఏసీబి చిక్కిన వరప్రసాద్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** విశ్వసనీయ సమాచారం ఆధారంగా, ఆదిభట్ల మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారిని లంచం తీసుకుంటుండగా పట్టుకోవడం జరిగిందని ఏసీబీ అధికారులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా, ఆదిబట్ల మున్సిపల్ (టిపిఒ)టౌన్ ప్లానింగ్ అధికారి వర ప్రసాద్, అసిస్టెంట్ వంశీ, ఓ ఇంటి అనుమతుల విషయంలో, ఆనంద్ అనే వ్యక్తినుండి 75 వేలు తీసుకుంటుండగా, పక్కా సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు, సోదాలు నిర్వహించి, అవినీతికి పాల్పడ్డ ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో విచారించి రిమాండ్ కు తరలించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. గత నెల రోజుల క్రితమే డిప్యూటేషన్ మీద ఇక్కడికి వచ్చిన టిపిఓ వరప్రసాద్, విధులు నిర్వహిస్తూ ఏసీబీకి పట్టు పడడం గమనార్హం.



## చర్చ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ మైనార్టీ నేత అయూబ్

**వరంగల్ మహా;** వరంగల్ నగరం 18వ డివిజన్ పరిధిలోని దైవ సేవకులు గంధం అరుణ్ జేమ్స్ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా చర్చ్ నిర్మాణం జరిగింది. ఈ సందర్భంగా నూతన చర్చ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వరంగల్ తూర్పు కాంగ్రెస్ సీనియర్ నేత, మైనార్టీ నాయకులు ఎండి అయూబ్ పాల్గొని అరుణ్ జీన్స్ కు వారి కమిటీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ సన్నిధికి రావడం ఇటువంటి మహత్తరమైన కార్యక్రమంలో పాలు పంచుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానని అదేవిధంగా నూతన చర్చ్ నిర్మాణంకై అరుణ్ జీన్స్ కు వారి కమిటీ సభ్యులందరూ కృషి చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం శ్రీ కృప బాప్టిస్ట్ చర్చ్ సంబంధికులు గంధం అరుణ్ జేమ్స్ దంపతులను అయూబ్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోదాటి అనిల్, ఐత క్రాంతి, సందేలా లాజరస్, క్రిస్టియన్ సోదరులు ప్రేమ్ కుమార్, ఎమ్మెస్ రాజు, సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ నీటి బిందువూ ముఖ్యమే...

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు**



**ఆదిలాబాద్, మహా :** నీటి ప్రతి బిందువు అమూల్యమని, ప్రజల భాగస్వామ్యంతోనే స్థిరమైన నీటి వనరుల సంరక్షణ సాధ్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు,జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో గురువారం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంజల్ సంచయ్ – జన్ భాగీదారీ అమలులో భాగంగా నిర్వహించిన మన బడి మన నీరు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ కలిసి ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు అంబేద్కర్ కూడలి నుండి జడ్పీ ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్న అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో న్యూట్రీ గార్డెన్, ఇంకుడు గుంత, గిరిజన ఆశ్రమ పాఠశాలలో అదనపు తరగతి గది, వర్షపు నీటి నిల్వ గుంతలను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ఆరంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ అత్యవసరమని, ప్రతి గ్రామం, ప్రతి పాఠశాలలో నీటి వనరులను కాపాడే దిశగా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. భూగర్భ జలాలు క్షీణిస్తున్న తరుణంలో వర్షపు నీటిని నిల్వచేసే ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, సోక్ పిట్ లు నిర్మించాలన్నారు. నీటి ప్రతి బిందువు అమూల్యం. ఈ రోజు మనం సంరక్షిస్తేనే రేపటి తరాలకు అందించగలుగుతామని తెలిపారు. జిల్లాలో వర్షపాతం అధికంగా నమోదవుతున్నప్పటికీ నిల్వ నీటి వనరుల కొరత ఉందని, అందువల్ల ఈ పథకం ద్వారా ప్రతి పాఠశాల స్థాయిలో అవగాహన సృష్టించి విద్యార్థుల ద్వారా కుటుంబాలకు సందేశం చేరవేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కమ్యూనిటీ సోక్ పిట్‌కు 18 వేలు, రూఫ్‌టాప్ రేన్‌వాటర్ హార్వెస్టింగ్ యూనిట్‌కు 25 వేలు మంజూరు చేస్తున్నామని, నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు నీటి ప్రాధాన్యం, వృథా కాకుండా వినియోగం, వర్షపు నీటి నిల్వ పద్ధతులపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో ప్రజలు వర్షాల కోసం కప్ప పూజలు, పాటల ద్వారా ప్రార్థించేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని జాగ్రత్తగా వినియోగించడం అత్యంత అవసరమని తెలిపారు. ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం ద్వారా భూగర్భ జలాలు నిల్వ ఉండి పంటల సాగుకు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజల సహకారమే ఈ కార్యక్రమ విజయానికి మూలం అన్నారు.జల్ సంచయ్-జన్ భాగీదారీ పథకం విజయవంతమైన అమలుకు గాను ఈ నెల 18న జిల్లా కలెక్టర్‌కు అవార్డు లభించనున్న సందర్భంగా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ కవి, రచయిత అందేశ్రీ మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన చేసిన సాహిత్య సేవలను కొనియాడారు.ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ, వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా రాబోయే దశాబ్దంలో నీటి కొరత సమస్యను అధిగమించవచ్చన్నారు. ప్రతి కొత్త ఇంటి నిర్మాణంలో ఇంకుడు గుంతలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.అనంతరం మన బడి-మన నీరు పోస్టర్ ను ఆవిష్కరణ చేసి, పాల్గొన్న వారందరూ "నీటి సంరక్షణ ప్రతిజ్ఞ" చేశారు. కార్యక్రమం ముగింపులో కవి అందేశ్రీకి రెండు నిమిషాల మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ స్టూడెంట్ ఛాంపియన్ అవార్డులు, క్రీడా విజేతలకు ఛాంపియన్ ట్రోఫీలు అందజేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ రవీందర్, డిడీ అంబాజీ, ఐటిడిఓ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఏయంసీ సమావేశం

జైనూర్ మహా : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐదవ పాలకవర్గం చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావ్ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. కపాస్ కిసాన్ యాప్ ను డౌన్లోడ్ చేయడంలో రైతులకు ఇబ్బంది ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించలని కోరారు. అదే విధంగా మొక్కజొన్న కొనుగోలులో ఇబ్బందులు పడ్తున్న రైతుల గురించి చర్చించడంతో పాటు, పత్తి కొనుగోలో తేమ శాతం దాదాపు 8 నుండి 12 శాతం ఉండాలని రైతులను కోరారు, జైనూర్ సి సి ఐ ద్వారా పత్తి కొనుగోళ్లు మొదలైనాయని రైతులు ఎవరు కూడా అధైర్యపడంద్దని అన్నారు. అన్ని మార్కెట్లను సందర్శించి పరిశీలిస్తామన్నారు, సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారులు వెంకట్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి అస్పాక్ హైమద్ ,ఏయంసీ డైరెక్టర్లు జాదవ్ లోకేందర్, పంద్రా షెక్కు, మాడవి కృష్ణా, ఆత్రం భుజంగరావు, మండడి లింగు, ఆడ రాజు, ఆత్రం లచ్చు, ఆడ నిల బాయి,ఆత్రం విషంరావు, మార్కెట్ సిబ్బంది మధు ,బాబులు,దత్తు తదితరులు పాల్గొన్నారు.

# టాస్క్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో టాస్క్ ద్వారా 4వ బ్యాచ్ లో శిక్షణ పొందిన వారికి టాస్క్ మేనేజర్ సాయికుమార్ తో కలిసి ధృవపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు టాస్క్ ద్వారా వివిధ కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టాస్క్ 4వ బ్యాచ్ లో శిక్షణ పొందిన 35 మందిలో 30 మంది ఆర్యవర్తన్ కంపెనీలో ఈ పబ్ ప్రోగ్రామర్లుగా ఎంపికయ్యారని తెలిపారు.. సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసంతో మాట్లాడవచ్చని, కష్టపడే తత్వం ఉండాలని సూచించారు. ఉపాధిలో నూతన అంశాలను నేర్చుకుంటూ వాటిని అమలు చేస్తూ అభివృద్ధి చెందాలని, చిత్తశుద్ధితో పనిచేసే వారికి అవకాశాలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారులు, శిక్షకులు సుధీర్, పూజ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 26 నాడు ఖమ్మంలో జరుగు మహాసభను విజయవంతం చేయండి




**మందమర్రి, మహా :** నవంబర్ 26 నాడు ఖమ్మం జిల్లా కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ముగింపు సందర్భంగా తలపెట్టిన మహాసభను ప్రజలు, కార్మికులు, కర్షకులు విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా సిపిఐ కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు భీమనాధుని సుదర్శన్, మందమర్రి పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజులు పిలుపునిచ్చారు. గురువారం వీరితో పాటు మరికొంతమంది నేతలు మందమర్రి బ్రాంచి ఏఐటీయూసీ కార్యాలయంలో 100 సంవత్సరాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపైన పురుడు పూసుకుని నేటికీ 100 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర ఉద్యమం నుండి భారతదేశ వ్యాప్తంగా ప్రజల కోసం కార్మిక వర్గం కోసం, భూమికోసం, భుక్తి కోసం, విరోచితమైనటువంటి పోరాటాలు చేసి కొన్నిరాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసి భారత ప్రజానీకానికి ఎలవేణి సేవలు చేసిందని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ తెలంగాణలో రైతాంగ సాయుధ పోరాటంతో బాంచను దొర అన్న ప్రజలచే బంధూకులు పట్టించి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించిన ఘనత తమదేనని స్పష్టం చేశారు. ఈ వంద సంవత్సరాల ఉత్సవాలకు 5 లక్షల మంది హాజరయ్యే దిశగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఈనెల 15 నుండి కొమరం భీం జిల్లా జోడేఘాట్ నుండి బస్సు జాత బయలుదేరి భద్రాచలం వరకు కొనసాగుతూ ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు వెల్లడించారు. ఈ జాతకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కోనమనేని సాంబశివరావు,జాతీయ రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి, తక్కలపల్లి శ్రీనివాసరావు, కలవేన శంకర్, సింగరేణి విభాగం నాయకులు అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్యలు సారథ్యంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిపిఐ నాయకులు రాయబారపు వెంకన్న, బండారి రాజేశం, అంతోని దినేష్, జెట్టి మల్లయ్య, తాళ్ల పెల్లి వీరన్న, కలువల శ్రీనివాస్, ఎండి రసూల్, గడ్డం సంతోష్, సంపత్, పూరెళ్ళ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## ఫుట్బాల్ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

**మందమర్రి, మహా :** ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నుండి నల్గొండ రాష్ట్రస్థాయి ఫుట్బాల్ టోర్నమెంట్ వెళుతున్న అండర్ 17 ఇయర్స్ బాయ్స్ క్రీడాకారులకు మందమర్రి పట్టణానికి చెందిన ఆర్.టి.ఎ ఏజెంట్ బేర వేణుగోపాలరావు గురువారం జెర్సీలు అందజేశారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో నల్లగొండ జిల్లాలో స్టేట్ లెవెల్ ఫుట్బాల్ టోర్నమెంటు కు వెళ్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి అండర్ 17 క్రీడాకారులకు తమ వంతుగాఏమైనాసహాయంచేద్దామనిబేరవేణుపిల్లలు బేర నిర్మిత, బేర మేనిత లు కోరగా వారి కోరిక మేరకు తన సొంత ఖర్చులతో జెర్సీలు కొనుగోలు చేసి క్రీడాకారులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఫుట్బాల్ క్రీడాకారులు తమ క్రీడ నైపుణ్యతను కనబరచి విజయం సాధించి మన మంచిర్యాల జిల్లా కు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ బాయ్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ , పీడీలు రాజయ్య, రమేష్, కోచ్ గాలి పెల్లి సురేందర్ లు పాల్గొన్నారు.

# గడపగడపకు ప్రభుత్వ పథకాలను చేరవేయాలి




**మహిళ కాంగ్రెస్ నేతలు నీలం పద్మ ,కృష్ణ వేణి**

**భువనగిరి, మహా:** గడపగడపకు ప్రభుత్వ పథకాలను . మహిళా కాంగ్రెస్ నేతలు చెర వేయాల నియాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ నేతలు పిలుపు నిచ్చారు. గురువారం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ అధ్యక్షతన భువనగిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ నేతల ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ లు అల్లూరి కృష్ణ వేణి,రేష్మ బేగం ,వడ్డూరి మౌనిక హాజర్తెనారు. ఈ సందర్భంగా నీలం పద్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి రివ్యూ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు జిల్లా,మండల ,గ్రామ బ్లాక్ ,బూత్ కమి ,కమటీలు వేయాలని పూర్తిస్థాయిలో కార్యవర్గం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి మహిళకు వివరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రభుత్వం కొత్తగా పది లక్షలకు పైగా రేషన్ కార్డులు అందజేయడంతో పాటు సన్నబియ్యంతో పేదల కడుపు నింపుతున్న విషయాన్ని గర్వంగా ప్రచారం చేయాలని మహిళా కాంగ్రెస్ నేతలు అన్నారు

**స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ**

అభ్యర్థులు విజయం సాధించే దిశగా కష్టపడాలని కోరారు. అదేవిధంగా జనాభాలో సగభాగం ఉన్న మహిళలు రాజకీయంగా చాలా వెనుకబడి ఉన్నారని స్థానిక సంస్థలలో 50% మహిళా ప్రతినిధులు ఉన్నట్లుగా శాసనసభలో మరియు పార్లమెంటులో 30% శాతం మహిళ సభ్యులు ఉండేటట్లు ప్రతి ఒక్కరు పోరాటం చేయాలని కోరారు. జిల్లాలో నామినేట్ పదవుల్లో 50% పదవులు మహిళలకు కేటాయించాలని మహిళా కాంగ్రెస్లో కష్టపడ్డ మహిళా నేతలను గుర్తించి స్థానిక సంస్థల ఎన్నికలలో టికెట్ ఇచ్చే విధంగా ప్రయత్నం చేస్తా నని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు నీరజ,జిల్లా జనరల్ సెక్రెటరీ కవిత,లక్ష్మీబాయి, పరంజ్యోతి ,బ్లాక్ అధ్యక్షరాలు స్వరూప రాణి,సిద్ధి లక్ష్మి మండల అధ్యక్షులు పి రజిత ,ఝాన్సీ, రేణుక, మమత, మండల ఉపాధ్యక్షురాలు పద్మ, స్వప్న ,భువనగిరి టౌన్ ఉపాధ్యక్షురాలు కవిత, శిరీష మండల కమిటీలు బ్లాక్ కమిటీలు పట్టణ కమిటీలు బూత్ కమిటీల మెంబర్స్ పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**సిర్పూర్ మహా :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగం మండలం గెర్రె గ్రామానికి చెందిన తలండి శ్రావణి కుటుంబానికి ప్రభుత్వం చేయూతనిచ్చింది. గత నెల 18న నిండు గర్భిణీ అయిన శ్రావణిని మామా ఆయన కుటుంబ సభ్యులు దారుణంగా హత్య చేసారు.దీంతో మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందజేసారు..జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్ గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.4,12,500 విలువైన చెక్కు ప్రొసీడింగ్స్ అందజేశారు. అదనంగా, ఇందిరమ్మ హౌసింగ్ పథకం కింద రూ.5 లక్షల విలువైన ఇల్లు మంజూరు చేశారు. అలాగే, మహిళా సంఘం ద్వారా మరో రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించారు మృతురాలి తమ్ముడు తలండి ప్రసిక్‌ను ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో నాల్గవ తరగతిలో చేర్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలతో ఉంటారని, అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్ ద్వారా సహాయం పొందవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, అదనపు కలెక్టర్ దేవిడ్, డీఎస్పీ వాహిదుద్దీన్, డిఆర్ఓ లోకేశ్వరరావు, ఎస్ఐ విక్రమ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# అంకితభావంతో చదువుకొని సమాజానికి వైద్య సేవలు అందించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**మంచిర్యాల, మహా :** మంచిర్యాల వైద్య కళాశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు అంకితభావంతో చదువుకొని సమాజానికి వైద్య సేవలు అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం హాజీపూర్ మండలం గుడిపేటలో ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025 సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు అంకితభావంతో చదువుకొని సమాజానికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వెల్లడించారు. వైద్య విద్యను అభ్యసించడంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. వసతి గృహంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 31 నాటికి గుడిపేటలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని మెడికల్ హబ్ గా అభివృద్ధి చేసేందుకు చురుగ్గా చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో 300 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు లక్షెట్టిపేట, చెన్నూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రతిరోజు దాదాపు 500 మంది ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆసుపత్రులు, వైద్య కళాశాల ద్వారా సమీప జిల్లాల నుండే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల నుండి ప్రజలు మెరుగైన వైద్య సేవలు ఆశిస్తారని, తదనుగుణంగా విద్యార్థులు విద్యలో నైపుణ్యం పొందాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు, సిబ్బందిని నియమించడం జరుగుతుందని, పీడియాట్రీషియన్, అనస్థీసియా, ఇతర వైద్య నిపుణులను తయారు చేసి ప్రజలకు సేవలు అందించడం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా మెడికల్ కౌన్సిల్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, నిరుపేదలకు వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 2047 రైసింగ్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా దేశానికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు 2047 నాటికి పూర్తవుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం అందజేసిన లింగయ్య యాదవ్

**వలిగొండ, మహా :** మండల పరిధిలోని అరూర్ గ్రామానికి చెందిన మర్రి ఐలమ్మ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించి ఆర్థిక సహాయం 10000 రూపాయలు అందజేసిన యాదవ సంఘం అధ్యక్షులు కసిర బోయిన లింగయ్య యాదవ్

# టీచర్లు టెట్ క్వాలిఫై కావాల్సిందే...

## తెలంగాణ ప్రభుత్వం టీచర్లకు షాక్
## ప్రమోషన్లు పొందాలన్నా తప్పనిసరి.. ఉత్తర్వులు జారీ



**హైదరాబాద్, మహా:** టీచర్లకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. తెలంగాణలో ఇకపై సర్వీస్ టీచర్లు సైతం టెట్ క్వాలిఫై కావాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం శుక్రవారం జారీ చేయనుంది. దీంతో ఇకపై టీచర్లు సర్వీస్‌లో ఉండాలన్నా.. ప్రమోషన్లు పొందాలన్నా టెట్ క్వాలిఫై తప్పనిసరి అని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు టెట్ నిబంధనలను తెలంగాణ విద్యా శాఖ సవరణ చేసింది. 2009 తర్వాత నియమితులైన 30 వేల మంది టీచర్లకు ఈ నిబంధన వర్తించనుంది. రానున్న రెండేళ్లలో సర్వీసులో ఉన్న టీచర్లంతా ఈ టెట్ పాస్ కావాల్సిందేనన్నది స్పష్టం. టెట్ నోటిఫికేషన్‌ను గురువారం తెలంగాణ విద్యా శాఖ విడుదల చేసింది. నవంబర్ 15వ తేదీ నుంచి ఈ దరఖాస్తులను అభ్యర్థుల నుండి స్వీకరిస్తారు. నవంబర్ 29వ తేదీతో ఈ దరఖాస్తులు స్వీకరణ ముగియనుంది. జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. కాగా.. ఈ ఏడాదికి సంబంధించి తొలి విడత టెట్ నోటిఫికేషన్ గత జూన్‌లో ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటికే ఈ పరీక్షల ఫలితాలు.. జులై 22న వెల్లడయ్యాయి. తాజాగా గురువారం రెండో విడత టెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులంతా ఈ టెట్‌లో అర్హత సాధించాలంటూ ఇప్పటికే సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాల్లో కొనసాగాలంటే.. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లంతా ఈ పరీక్ష పాస్ కావాల్సి ఉంది.



## 42% రిజర్వేషన్ కోసం బీసీ సంఘాల ధర్నా

**సిర్పూర్ మహా :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం బీసీ సంఘాలు పెద్దఎత్తున ధర్నా చేపట్టాయి. బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అజ్మీరా శ్యామ్ నాయక్ హాజరై సంఘాలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ వర్గాల న్యాయమైన హక్కుల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. బీసీల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందంటూ బీసీ సంఘాల నాయకులు సంకల్పం వ్యక్తం చేశారు. బీసీలకు సరైన రిజర్వేషన్లు ఇవ్వడం సమాజ సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ధర్నాలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేశవరావు మాదిగ, బీసీ సంఘం అధ్యక్షుడు రూప్నర్ రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.డి. నిజాం, ప్రణయ్, విశ్వనాథ్, జక్కన్న, బాలు, కమలాకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వైరాగడే మారుతి, పటేల్ శంకర్, పటేల్ మెంగాజీ, బొట్టుపల్లి జైరాం, పొన్న రమేష్, మహీరాజ్ తదితరులు పాల్గొన్నారు.




## వలిగొండలో బీసీల ధర్మ పోరాట దీక్ష

**వలిగొండ, మహా :** వలిగొండ మండల కేంద్రంలో బీసీల న్యాయమైన డిమాండ్ కోసం ధర్మ పోరాట దీక్షను బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలకు రావలసిన 42 శాతం రిజర్వేషన్ కోసం పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని చట్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని వారు అన్నారు రిజర్వేషన్లు ఎవరో ఇచ్చేది కాదని రాజ్యాంగం కల్పించిన హక్కు అని వారన్నారు ఈ కార్యక్రమంలో దుబ్బ రామకృష్ణ పబ్బు స్వామి శీలం స్వామి రాగిర్ మల్లేష్ గౌడ్ అప్రోచ్ గుండు కృష్ణ రామ్ చందర్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

# కేంద్రం మెడలు వంచి 42 శాతం రిజర్వేషన్లు సాధిద్దాం....

**ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**



కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధిద్దామని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు... యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం రైతు బజార్ వద్ద నేడు బీసీల ధర్మ పోరాట దీక్షలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రిజర్వేషన్లు ఎవరిచ్చే భిక్షకాదని ఇది మా హక్కు అన్నారు... ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆవేజ్ కిస్తీ, బిసి జెఏసి నాయకులు గొట్టిపాముల బాబురావు, కొత్త నర్సింహ్మా, ప్రమోద్ కుమార్, అశోక్,శ్రీశైలం,బర్రె జహాంగీర్, రామకృష్ణ, బట్టు రాంచెంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్య వైద్య అంశాలపై సిపిఎం గ్రామీణ సర్వే



**సిర్పంగి స్వామి మండల కార్యదర్శి**

**వలిగొండ, మహా** ప్రజల ఆర్థిక సామాజిక విద్య వైద్య అంశాలపై సిపిఎం గ్రామీణ సర్వేలను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు గురువారం మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో గ్రామీణ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల యొక్క ఆర్థిక మరియు సామాజిక విద్య వైద్యం వ్యవసాయ ఉపాధి లాంటి అనేక సమస్యలపై సర్వే నిర్వహిస్తున్నామని గ్రామాల్లో అనేకమంది పేద ప్రజలకు నేటికి సెంటు భూమిలేదని ప్రభుత్వ విద్యా వైద్య ఉపాధి సక్రమంగా అందడం లేదని అనేకమంది అరకొరక జీవితాలతో ఎలాంటి ఆదాయం లేక ప్రైవేటు అప్పుల్ని ఆశ్రయించి వాటికి వడ్డీలు చెల్లించలేక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు ప్రభుత్వాలు ఎన్ని మారినా ప్రజల యొక్క ఆర్థిక సామాజిక స్థితిలో మార్పు లేదన్నారు గ్రామాలలో వృత్తులు దెబ్బతిని వృత్తిదారులు రైతులకు గిట్టుబాటు ధర లేక పంటల్లో నష్టపోయి అప్పుల కురుకపోయి కూలీలుగా మారుతున్నారన్నారు సమస్యలన్నింటిపై సిపిఎం సర్వే నిర్వహించి భవిష్యత్తు పోరాట కార్తవ్యాలను రూపొందిస్తుంది అని తెలిపారు ఈ కార్యక్రమంలో మారబోయిన నరసింహ వేముల నాగరాజు దొడ్డి బిక్షపతి కొమ్మిడి సత్తిరెడ్డి శంకరయ్య ముత్యాలు రవి నరసింహ జాంగిర్ బాలయ్య చిరంజీవి అంజయ్య దశరథ శోభ లక్ష్మి మహేష్ తదితరులు పాల్గొన్నారు

## ‘సర్దుబాటు’పైనే వొడాఫోన్ ఐడియా ఆశలన్నీ..



అప్పుల ఊబిలో కూరుకుపోయిన వొడాఫోన్ ఐడియా (వీఐ).. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయ (ఏజీఆర్) బకాయిల విషయంలో తగిన, దీర్ఘకాలిక పరిష్కారాన్ని ఆశిస్తోంది. ఈ సమస్యపై ప్రభుత్వంతో చురుగ్గా సంప్రదింపులు జరుగుతున్నాయని కంపెనీ సీఈఓ అభిజిత్ కిశోర్ పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి దాదాపు రూ.78,500 కోట్ల ఏజీఆర్ బకాయిలు పేరుకుపోగా, దీనికి సంబంధించి తగిన నిర్ణయం తీసుకోవాలని తాజాగా సుప్రీం కోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. కాగా, క్యూ2 ఫలితాల అనంతరం అభిజిత్ ఇన్వెస్టర్లతో మాట్లాడుతూ.. నిధుల సమీకరణ కోసం బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలతో సహా పలు మార్గాలను అన్వేషిస్తున్నామని చెప్పారు. ఏజీఆర్ పరిష్కారంపైనే ఈ ప్రయత్నాలన్నీ ఆధారపడి ఉంటాయన్నారు. కాగా, 2025-26 సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్ధంలో వీఐ నికర నష్టం రూ.12,132 కోట్లుగా నమోదైంది. కంపెనీ మొత్తం రుణ భారం రూ.2.02 లక్షల కోట్లకు చేరింది.

## క్యూ2లో జీడీపీ వృద్ధి 7.2 శాతం



**న్యూఢిల్లీ:** దేశ జీడీపీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలోనూ (జూలై-సెప్టెంబర్) బలమైన పనితీరు చూపిస్తుందని, 7.2 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్-రా) అంచనా వేసింది. ప్రైవేటు వినియోగం కీలక చోదకంగా నిలుస్తుందని తెలిపింది. క్రితం ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 5.6 శాతంగా ఉండడం గమనార్హం. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) జీడీపీ 7.8 శాతం వృద్ధిని నమోదు చేయడం తెలిసిందే. క్యూ2 జీడీపీ గణాంకాలు ఈ నెల 28న విడుదల కానున్నాయి. “ఉన్నత, మధ్యాదాయ వర్గాల వారికి ఆదాయం స్థిరంగా పెరుగుతుండడం ప్రైవేటు వినియోగానికి కీలక చోదకంగా నిలుస్తుంది. సేవల రంగం బలమైన పనితీరు, వస్తు ఎగుమతుల పెరుగుదల జీడీపీ వృద్ధిని మరింత పైకి తీసుకెళుతుంది”అని ఇండ్-రా ఆర్థికవేత్త పరాస్ జస్రాయ్ పేర్కొన్నారు. దేశీ డిమాండ్ బలంగా ఉండడం, ఆర్‌బీఐ అంచనాలకంటే వేగంగా రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం వేతన వృద్ధికి, వినియోగానికి మద్దతుగా నిలుస్తున్నట్టు ఈ నివేదిక తెలిపింది. ప్రైవేటు వినియోగం క్యూ2లో 8 శాతం వృద్ధి చెందొచ్చని అంచనా వేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ2లో 6.4 శాతం వృద్ధి నమోదు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ1లో ఇది 7 శాతం పెరిగినట్టు తెలిపింది. ఆదాయపన్ను తగ్గింపులు సైతం వినియోగానికి మద్దతుగా నిలుస్తాయని పేర్కొంది.

## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం ఫ్లాట్‌గా ముగిశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 0.01 శాతం లేదా 12.16 పాయింట్లు పెరిగి 84,478.67 వద్ద స్థిరపడింది. మరోవైపు నిఫ్టీ సూచీ కూడా 0.01 శాతం లేదా 3.35 పాయింట్లు పెరిగి 25,879.15 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్ టాప్ గెయినర్లుగా ఉండగా, ఎటర్నల్, టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ (టీఎంసీవీ), ఎంఅండ్ఎం ప్రధానంగా వెనుకబడినవాటిలో ఉన్నాయి. అదేవిధంగా, ఎన్ఎస్ఈలో ఏషియన్ పెయింట్స్, హిందాల్కో, ఇండిగో టాప్ గెయినర్లుగా ఉండగా, ఎటర్నల్, టీఎంసీవీ, ఎంఅండ్ఎం టాప్ లూజర్లలో ఉన్నాయి. ఇక విస్తృత సూచీలు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.35 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 0.37 శాతం నష్టపోయాయి. రంగాలవారీగా నిఫ్టీ మెటల్, ఫార్మా, రియల్టీ వరుసగా 0.44 శాతం, 0.41 శాతం, 0.42 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 0.68 శాతం నష్టపోయింది.

## ఏరోక్స్-ఈ వచ్చేస్తోంది
## 106 కిమీ రేంజ్!

యమహా కంపెనీ ఎలక్ట్రిక్ వాహన విభాగాన్ని విస్తరించడంతో భాగంగా.. ఏరోక్స్-ఈ ఆవిష్కరించింది. ఇప్పటికే పెట్రోల్ వెర్షన్ రూపంలో అందుబాటులో ఉన్న ఈ స్కూటర్.. త్వరలో ఎలక్ట్రిక్ రూపంలో దేశీయ విఫణి లాంచ్ కానుంది. ఇందులో 1.5 కిలోవాట్ రిమూవబుల్ బ్యాటరీ 106 కిమీ రేంజ్ అందిస్తుందని సమాచారం. కాగా 9.5 కేడబ్ల్యు ఎలక్ట్రిక్ మోటారు 48 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది.

యమహా ఏరోక్స్ ఈ స్కూటర్ చూడటానికి.. సాధారణ మోడల్ మాదిరిగా కనిపించినప్పటికీ, ఇది ఎలక్ట్రిక్ స్కూటర్ కావడంతో కొన్ని కాస్మొటిక్ అప్డేట్స్ పొందుతుంది. అంతే కాకుండా ఇందులో డ్యూయెల్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, యాబ్ బేస్డ్ కనెక్టివిటీతో కూడిన TFT ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్ కూడా ఉన్నాయి. ఎకో, స్టాండర్డ్, పవర్, ఓవర్‌టేకింగ్ చేసేటప్పుడు ఉపయోగించగల అదనపు బూస్ట్ మోడ్ వంటి రైడింగ్ మోడ్స్ ఉన్నాయి. సస్పెన్షన్ సెటప్ స్టాండర్డ్ వెర్షన్ నుంచి తీసుకున్నారు. కాబట్టి దీని ముందు భాగంలో టెలిస్కోపిక్ ఫోర్క్, వెనుక భాగంలో డ్యూయల్ షాక్ అబ్జార్బర్‌లు ఉన్నాయి. రెండు చివర్లలో.. డిస్కులు బ్రేక్స్ ఉన్నాయి. కాబట్టి పనితీరు పరంగా బాగుంటుందని భావిస్తున్నారు. కాగా దీని ధరలను కంపెనీ లాంచ్ సమయంలో వెల్లడించనుంది.





## సిల్వర్‌పై లోన్లు

ఆర్థికంగా అత్యవసరం తలెత్తినప్పుడు బంగారం ఉంటే అక్కరకువస్తుంది. బ్యాంకులు, ఇతర సంస్థల్లో తాకట్టు పెట్టి లోన్ పొందవచ్చు. ఈ కారణంతోనే చాలామంది మధ్య తరగతి వాళ్లు కూడా తమ స్తోమతకు మించి బంగారం కొనుగోలు చేస్తుంటారు. అయితే మరి పేద, సామాన్య ప్రజల దగ్గర బంగారు ఆభరణాలు, వస్తువులు ఉండవు. ఏదో కొద్దో గొప్పో వెండి ఆభరణాలు, వస్తువులు ఉంటే ఉంటాయి. ఏదైనా అవసరం వచ్చినప్పుడు వాటిపై లోన్‌లు ఎవరూ ఇవ్వరు కదా.. అని ఇన్నాళ్లు బాధపడి ఉంటారు. ఇకపై ఆ బాధ అక్కర్లేదు. పేదల బంగారంగా భావించే వెండిపైనా బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు రుణాలు ఇవ్వనున్నాయి. వెండిపై రుణాలకు సంబంధించి వాణిజ్య బ్యాంకులు, నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, సహకార బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలకు రుణ మార్గదర్శకాలను ఆర్బీఐ సవరించింది. ఇందులో భాగంగా 2026 ఏప్రిల్ 1 నుండి వెండి ఆభరణాలు, వస్తువులు లేదా నాణేలను తాకట్టు పెట్టి రుణాలను పొందవచ్చు. పేదలు, సామాన్యులకు రుణ లభ్యతను మెరుగుపరచడానికి ఆర్బీఐ ఈ మార్పులు చేస్తోంది. అయితే ప్రాథమిక వెండి అంటే ఆభరణాలు, వినియోగ వస్తువులు కాకుండా వాణిజ్యానికి ఉపయోగించే వెండి బార్‌లపై మాత్రం ఈ రుణ సదుపాయం ఉండదని ఆర్బీఐ స్పష్టం చేసింది. అయితే బంగారంపై ఇచ్చినట్లుగా దాటి రేటు ఆధారంగా అధిక మొత్తంలో రుణాలు వెండిపై ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చని ఆర్బీఐ చెబుతోంది. వెండికి ఉన్న అధిక అస్థిరత, తక్కువ లిక్విడిటీ కారణంగా లోన్‌టువాల్యూ నిష్పత్తులు, వడ్డీ రేట్లకు సంబంధించి వెండిపై రుణాలు బంగారు రుణాలతో పోల్చితే భిన్నంగా ఉండవచ్చు. అందువల్ల బ్యాంకులు, రుణ సంస్థలు వెండిఆధారిత రుణాలపై తక్కువ క్రెడిట్ పరిమితులను, కొంచెం ఎక్కువ వడ్డీ రేట్లను నిర్ణయించవచ్చు. తాకట్టు పెట్టిన వెండి స్వచ్ఛత, నిల్వ, బీమా ఖర్చులు, తిరిగి చెల్లింపు షెడ్యూల్, జప్తు నిబంధనలతో సహా కారకాలను జాగ్రత్తగా పరిగణనలోకి తీసుకోవాలని రుణగ్రహీతలకు ఆర్బీఐ సూచించింది.

## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL

## పుల్వామా మాస్టర్‌మైండ్‌తో షహీన్‌కు లింకులు?



ఫరీదాబాద్ పేలుడు పదార్థాల కేసులో అరెస్టయిన డాక్టర్ షహీన్ సయీద్‌పై ఎన్ఐఏ జరుపుతున్న దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పుల్వామా దాడుల మాస్టర్ మైండ్ ఉమర్ ఫారుక్ భార్య అఫీరా బీబీతో సంబంధాలున్నట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. అంతేకాకుండా జైషేమహమ్మద్ చీఫ్ మసూద్ చెల్లెలితోనూ తను సంప్రదింపులు జరిపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పుల్వామా అటాక్ ఈపదం వింటే చాలు భారతావని గుండె బరువెక్కుతోంది. 2019లో సీఆర్పీఎఫ్ సిబ్బంది కాన్వాయ్‌పై జైషేమహమ్మద్ అనే ఉగ్రసంస్థ జరిపిన ఈ దాడిలో 40 మంది జవాన్లు వీరమరణం పొందారు. ఈ దాడుల వ్యూహకర్తగా ఉమర్ ఫారుక్ భావిస్తారు. తాజాగా ఫరీదాబాద్‌లో అరెస్టయిన డా.షహీన్ సయీద్‌కి ఫారుక్ భార్య అఫీరా బీబీతో సంబంధాలున్నట్లు ఎన్ఐఏ అనుమానిస్తుంది. ఇటీవలే ఏర్పాటైన జైషే మహమ్మద్ మహిళా విభాగం జమాత్‌ఉల్‌మెమినాత్ లో అఫీరా బీబీది ప్రధానపాత్రని దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. డా. షహీన్ కేవలం అఫీరాతోనే కాకుండా జైషే మహమ్మద్ చీఫ్ మసూద్ అజర్ చెల్లెలితోనూ సంప్రదింపులు జరిపినట్లు ఎన్ఐఏ ఆరోపిస్తోంది. ఫరీదాబాద్ పేలుడు పదార్థాల అక్రమ రవాణా కేసులో డాక్టర్ షహీన్‌ను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అరెస్టు చేసింది. విచారణలో జైషే మహమ్మద్ మహిళా విభాగాన్ని ఇండియాలో ఏర్పాటు చేయడానికి ప్రయత్నించినట్లు తేలింది. దీంతో ఎన్ఐఏ మరింత లోతుగా విచారణ జరుపుతుంది.

## భారత్‌తో యుద్ధం చేస్తాం
### పాక్ రక్షణ మంత్రి

పాకిస్థాన్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ అంటేనే వివాదాస్పద వ్యాఖ్యలకు, ఉత్తుత్తి మాటలకు పెట్టింది పేరు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సైతం భారత్‌పై ఎన్నో సార్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆయన పాకిస్థాన్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ప్రసంగిస్తూ పడమర దిక్కున భారత్‌తో, తూర్పు దిక్కున అఫ్ఘానిస్తాన్‌తో ఏకకాలంలో యుద్ధం చేయడానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉందన్నారు. "తొలిరౌండ్‌లో అల్లా మాకు సహాయం చేశారు. రెండో రౌండ్‌లోనూ ఆయన మాకు అండగా ఉంటార"ని తెలిపారు. కాబూల్‌లోని పాలకులు తలచుకుంటే పాకిస్థాన్ లోని టెర్రరిజాన్ని ఆపవచ్చు కానీ వారు అలా చేయడం లేదని.. దీనికి తగిన రీతిలో బదులిస్తామని హెచ్చరించారు. మంగళవారం పాకిస్థాన్‌లో జరిగిన బాంబుదాడిలో 12 మంది మరణించారు. అది తమ చర్యేనని పాకిస్థాన్ తాలిబన్ గ్రూప్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఖవాజా ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఖవాజా తాజా వ్యాఖ్యలను భారత్ ఖండించింది. ఆసిఫ్ తన వ్యాఖ్యలతో పరిస్థితుల నుంచే తప్పదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ఆయన స్వరం ఇస్లామాబాద్ భయాన్ని తెలియజేస్తోందన్నారు. ఇటీవల భారత్ లో జరిగిన ఎర్రకోట బాంబ్ బ్లాస్ట్ విషయంలో సైతం ఖవాజా ఆసిఫ్ తలబిరుసుగా మాట్లాడారు. ఆ ప్రమాదం గ్యాసు లీకు వల్ల జరిగిందని, ఆ దాడిని భారత్ రాజకీయం చేస్తోందని వ్యాఖ్యానించారు. పేలుడు పదార్థాల వల్లే ఎర్రకోట కారు పేలుళ్లు జరిగాయని ఫోరెన్సిక్ నివేదికలు ఇచ్చిన సంగతి తెలిసిందే.

## నితీష్ ఇంటి ముందు టైగర్ పోస్టర్




**పట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు ఎగ్జిట్ పోల్స్ పట్టం కట్టాయి. ఈ నేపథ్యంలో ఎన్డీఏ భాగస్వామ్య పార్టీ డీజేడీయూలో అపరిమితమైన ఉత్సాహం తొణికిసలాడుతోంది. నేతలు, కార్యకర్తలు సంబరాల్లో మునిగితేలుతున్నారు. ఇంతలో ఫలితాలకు ముందే సీఎం నితీష్ ఇంటి బయట ‘టైగర్ అభీ జిందా హై’ అంటూ రాసిన ఒక పోస్టర్ వెలిసింది. నితీష్ కుమార్ పార్టీ గణనీయమైన సీట్లను గెలుచుకుంటుందని అందరూ భావిస్తున్నారు. ఇది నితీష్ తన ముఖ్యమంత్రి తన పదవిని నిలబెట్టుకునేందుకు అవకాశాలను మరింత పెంచుతుందని అంటున్నారు. పట్నాలో సీఎం ఇంటి ముంగిట వెలసినీ పోస్టర్‌కు సంబంధించిన వీడియోను బీహార్ మాజీ మంత్రి రంజిత్ సిన్హా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ పోస్టర్‌పై ‘టైగర్ అభీ జిందా హై’ (పులి ఇంకా బతికే ఉంది) అని రాసివుంది. అలాగే దానిలో నితీష్ కుమార్‌ను.. ‘దళితులు, మహా దళితులు, వెనుకబడినవారు, అత్యంత వెనుకబడినవారు, అగ్రవర్ణాలు, మైనారిటీల రక్షకుడు’ అని రాశారు. ఈ సందేశం ద్వారా ముఖ్యమంత్రి నితీష్‌ను సమాజంలోని అన్ని వర్గాల కోసం పనిచేసే సంఘటిత వ్యక్తిగా చూపించడానికి ప్రయత్నించారు.

నవంబర్ 14న బీహార్ ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి. తదుపరి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎవరు ఏర్పాటు చేస్తారనేది ఈ ఫలితాలు నిర్ణయించనున్నాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని సన్నాహాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్స్ (వీవీపాట్‌లు)కు రెండంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రాల చుట్టూ భద్రతను పటిష్టం చేశారు.

## 10.1 కోట్ల మంది...
## ఒడుదొడుకులే అసలు కారణం

మధుమేహ బాధితుల పరంగా భారత దేశం ప్రపంచానికే రాజధాని అయితే, దక్షిణాది రాష్ట్రాలు భారత దేశానికి రాజధానులుగా మారాయని గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో మధు మేహ బాధితుల సంఖ్య ఇప్పుడు 10.1 కోట్లకు చేరింది. భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో మధుమేహం క్రమంగా వేగాన్ని పుంజుకుంటోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తోంది. మధుమేహం నియంత్రణ, నిరోధం పట్ల అవగాహన కల్పించడానికి ఇన్సులిన్‌ను కనుగొన్న సర్ ఫ్రెడరిక్ బ్యాంటింగ్ పుట్టిన రోజైన నవంబర్ 14వ తేదీని ‘ప్రపంచ మధుమేహ నిరోధక దినం’గా ప్రతి ఏడాదీ జరుపుకోవడం ముదావహం. నేడు మనిషి జీవన విధానం, ఆహారంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు... మధుమేహం వంటి జీవితకాల దీర్ఘ వ్యాధులకు ఆజ్యం పోస్తున్నాయి. అతి చిన్న వయసు నుండే ఏమాత్రం శారీరక శ్రమ లేక పోవడం, ఆహారంలో చోటు చేసు కున్న మార్పులు, కల్తీలు, పంట పొలాల్లో వేసే రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు, విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగం, పర్యావరణ మార్పులు, కొత్త కొత్త వైరల్ వ్యాధులు, వృత్తిపర మానసిక ఒత్తిడి, జన్యువులలో ఉత్పరివర్తనలు... ఇలా ఎన్నో కారణాలు




రక్తంలో షుగర్‌ను నియంత్రించే ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే ప్యాంక్రియాస్ (క్లోమ గ్రంథి)ని అసాధారణ రీతిలో ప్రభావితం చేస్తున్నాయి.
శరీర అవసరాలకు సరిపడా ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవటం, ఇన్సులిన్ పనితీరులోని లోపాలు (రెసిస్టెన్స్), శరీర కణాలు ఇన్సులిన్‌ను వినియోగించుకోలేకపోవడం... వెరసి రక్తంలో అసాధారణ స్థాయిలో చక్కెర శాతాన్ని పెంచేస్తున్నాయి. మనం నిత్య జీవితంలో వాడే ప్లాస్టిక్‌ల అవశేషాల ప్రభావం వల్ల ప్యాంక్రి యాస్ సహజసిద్ధంగా ఉత్పత్తి చేసే ఇన్సులిన్‌ను శరీర అవసరాలకు సరిపడా ఉత్పత్తి చేయలేకపోతోంది. ఇన్సులిన్ ఉత్పత్తి అయినా... శరీర కణజాలాలలో నిరోధకత వచ్చి అది ఉపయోగపడక పోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అసాధారణ రీతిలో పెరిగిపోతోంది. మందుల వాడకం, ఆహార నియమాలు పాటించటం, క్రమం తప్పక వ్యాయామం చేయడం ద్వారా జీవితాంతం అప్రమత్తంగా ఉండాలి.


## శబరిమల, ఎరుమేలిలో.. రసాయనాల కుంకుమపై నిషేధం: హైకోర్టు






**పథనంతిట్ట:** హరిహరపుత్రుడు అయ్యప్ప స్వామి కొలువై ఉన్న శబరిమలలో.. ధర్మశాస్తాకు నిలయమైన ఎరుమేలిలో రసాయనాల కుంకుమ విక్రయాలకు కేరళ హైకోర్టు కళ్లెం వేసింది. భక్తుల ఆరోగ్యమే తమకు ముఖ్యమని, కెమికల్స్‌తో తయారైన కుంకుమను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు జస్టిస్ వి.రాజా విజయరాఘవన్, జస్టిస్ కేవీ జయకుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పునిచ్చింది. కేరళ ప్రభుత్వం ఈ విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. ఇటీవల కేరళ ప్రభుత్వం పంపానదిలో సబ్బులు, షాంపూలను నిషేధించింది. అదేవిధంగా రసాయనాలతో తయారైన కుంకుమను ఎరుమేలి, శబరిమలలో విక్రయించడానికి వీలు లేదని తేల్చిచెప్పింది. సహజసిద్ధంగా తయారైన కుంకుమ విక్రయాలకు మాత్రమే అనుమతి ఉంటుందంటూ ఉత్తర్వులు జారీ చేసింది. శబరిమల, ఎరుమేలిలో వ్యాపారులకు కుంకుమను సరఫరా చేసే హోల్‌సేల్ వ్యాపారి ఒకరు ఈ ఉత్తర్వులను హైకోర్టులో సవాలు చేశారు. మండల, మకరవిళక్కు సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని, రూ.లక్షలు ఖర్చు చేసి.. కుంకుమ స్టాక్ తెచ్చుకున్నామని, ఇప్పటికిప్పుడు ప్రభుత్వం ఒక్క ఉత్తర్వుతో నిషేధం విధిస్తే తాము నష్టపోతామని వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. తమకు భక్తుల ఆరోగ్యమే ముఖ్యమని, కెమికల్స్‌తో తయారైన కుంకుమను అనుమతించేది లేదని తేల్చిచెప్పింది. కేరళ సర్కారు ఉత్తర్వులను సమర్థించింది. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు, ప్రభుత్వం తరఫు న్యాయవాదుల వాదనలతో ఏకీభవించింది.

# బిజీగా రాజాసాబ్



సినిమా ఇండస్ట్రీలో నటుడిగా సక్సెస్‌ఫుల్‌గా 23 ఏళ్లు పూర్తి చేసుకున్నారు ప్రభాస్. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'ఈశ్వర్' 2002 నవంబరు 11న విడుదలైంది. ఈ చిత్రాన్ని జయంత్. సి పరాన్జీ దర్శకత్వంలో కె. అశోక్ కుమార్ నిర్మించారు. కాగా, హీరోగా ప్రభాస్ 23 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన తాజా చిత్రాల్లో ఒకటైన 'ది రాజాసాబ్' నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న ఈ ఫ్యాంటసీ హారర్ కామెడీ చిత్రంలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్, రిద్ది కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదల కానుంది. ఇక ఈ సినిమా కాకుండా హను రాఘవపూడి దర్శకత్వంలోని పీరియాడికల్ సినిమా 'ఫౌజి'లో ప్రభాస్ హీరోగా నటిస్తున్నారు. ఇంకా 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించనున్న 'స్పిరిట్' చిత్రం త్వరలోనే సెట్స్‌కు వెళ్లనుంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ డైరెక్షన్‌లోని 'కల్కి 2' ('కల్కి 2898 ఏడీ' సీక్వెల్) చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుంది. అలాగే ప్రముఖ కన్నడ నిర్మాణ సంస్థ హోంబలే ఫిలింస్‌తో ప్రభాస్ మూడు కొత్త సినిమాలు కమిట్ అయిన సంగతి తెలిసిందే. ఈ చిత్రాలకు ఎవరు దర్శకత్వం వహిస్తారనే విషయంపై త్వరలో ఓ స్పష్టత రానుంది. ఇలా వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంటున్నారు ప్రభాస్.

# అమలా పాల్ రీఎంట్రీ



అమలాపాల్.. ఆ పేరే ఒక సంచలనం అని చెప్పవచ్చు. వివాదాలకు కేరాఫ్ అనే చెప్పాలి. ఆదిలోనే చర్చనీయాంశమైన కథా పాత్రల్లో నటించిన అమలాపాల్.. 'మైనా' చిత్రంతో మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ తరువాత ప్రముఖ హీరోలతో నటించే అవకాశాలు వరించడంతో స్టార్ హీరోయిన్‌గా రాణించారు. అలా విక్రమ్ హీరోగా నటించిన దైవతిరుమగళ్ (నాన్న).. విజయ్‌కు జంటగా తలైవా వంటి భారీ చిత్రాల్లో నటించారు. ఎక్కువగా తమిళ్‌లోనే కనిపించిన ఈ బ్యూటీ తెలుగులోనూ ఇద్దరమ్మాయిలతో, నాయక్ వంటి చిత్రాల్లో నటించి బహుభాషా నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

అయితే, కథానాయకిగా బిజీగా ఉండగానే దర్శకుడు విజయ్‌తో 2014లో ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే వారి వివాహ బంధం ఎక్కువ కాలం సాగలేదు. మనస్పర్థల కారణంగా విడిపోయారు. ఆ తరువాత చిత్రాల్లో నటించడం మొదలెట్టిన అమలాపాల్ నిర్మాతగానూ అవతారమెత్తి మలయాళంలో ఒక చిత్రం చేశారు. ఆ తరువాత జగత్ దేశాయ్ అనే వ్యక్తిని రెండో పెళ్లి చేసుకుని నటనకు దూరంగా ఉంటూ వచ్చారు. వీరికి ఇళయ్ అనే మగబిడ్డ ఉన్నారు. దీంతో ఇప్పుడు మళ్లీ నటించడానికి సిద్ధం అవతున్నట్లు సమాచారం.

అందుకోసం తీవ్రంగా కసరత్తు చేస్తూ.., కేరళ చికిత్స సాయంతో తన అందాలకు మెరుగు పెడుతున్నారు. ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అంతే కాకుండా నటించడానికి కథలను వింటున్నట్లు తెలిసింది. దీంతో అమలాపాల్ సెకెండ్ ఇన్నింగ్ ఖాయం అంటున్నారు సినీ వర్గాలు. కాగా సమాచారంతో ఆమె అభిమానులను ఖుషీ అవుతున్నారు.





# రాజమౌళి బిగ్ ఈవెంట్..
## హోస్ట్‌గా ప్రముఖ యూట్యూబర్ ఆశిష్ చంచలాని

మహేష్‌బాబు రాజమౌళి కాంబోలో వస్తోన్న యాక్షన్ అడ్వెంచరస్ మూవీ ఎస్ఎస్ఎంబీ29. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించి బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చాడు మన దర్శకధీరుడు. ఓ సాంగ్‌ను రిలీజ్ చేయడంతో ప్రియాంక చోప్రా ఫస్ట్ లుక్ రివీల్ చేశారు. అయితే ఈ మూవీ టైటిల్‌పై ఫ్యాన్స్‌లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. టైటిల్ ఎప్పుడెప్పుడు రివీల్ చేస్తారా? అని మహేశ్ బాబు ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాజమౌళి బిగ్ ఈవెంట్ ప్లాన్ చేశారు.

హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో బిగ్ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 15న గ్రాండ్ ఈవెంట్ జరగనుంది. ఈ వేడుకలో భాగంగా మూవీ టైటిల్‌తో పాటు మహేష్‌బాబు ఫస్ట్ లుక్‌ను రివీల్ చేయనున్నారు. దీంతో భారీగా ఫ్యాన్స్ రానున్న నేపథ్యంలో దర్శకుడు రాజమౌళి కొన్ని సూచనలు ఇస్తూ ఒక వీడియో విడుదల చేశారు. ఈవెంట్ పాస్‌లు ఉన్నవాళ్లకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన క్లారిటీ ఇచ్చారు.

అయితే తాజాగా ఈ ప్రతిష్టాత్మక గ్రాండ్ ఈవెంట్‌కు హోస్ట్ ఎవరన్నది కూడా టాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇలాంటి పెద్ద పెద్ద ఈవెంట్లకు మన స్టార్ యాంకర్ సుమ ఉండనే ఉంటుంది. సుమతో పాటు ప్రముఖ యూట్యూబర్ ఈ మెగా ఈవెంట్‌కు హోస్ట్‌గా పనిచేయనున్నారు. బాలీవుడ్‌కు చెందిన ఆశిష్ చంచలానీ హోస్ట్‌గా కనిపించనున్నారు. ఈ విషయాన్ని ఓ ఫన్నీ వీడియో ద్వారా మేకర్స్ రివీల్ చేశారు. రాజమౌళితో కలిసి ఈ వీడియోను రూపొందించారు.

కాగా.. తొలిసారి రాజమౌళి మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు గ్లోబ్ ట్రాటర్ అనే టైటిల్ ఖరారు చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ బిగ్ ఈవెంట్‌లో ఈ విషయాన్ని రివీల్ చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు దాదాపు 50 వేల మందికి పైగా అభిమానులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నవంబర్ 15న సాయంత్రం 7 గంటలకు జియోహాట్‌స్టార్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు.



# 43 ఏళ్ల వయసులోనూ శ్రియ ఐటమ్ సాంగ్

సాధారణంగా వయసు పెరిగిన తర్వాత హీరోయిన్లకు అవకాశాలు తగ్గిపోతాయని అంటుంటారు. చాలామంది విషయంలో ఇలా జరిగింది కూడా. కానీ కొందరు మాత్రం పెద్దవాళ్లు అవుతున్నా గ్లామర్ విషయంలో అస్సలు తగ్గట్లేదు. బాలీవుడ్ బ్యూటీ మలైకా అరోరాకు అయితే 50 ఏళ్లు దాటిపోయాయి. కానీ మొన్నీమధ్యే వచ్చిన 'థామా'లో ఐటమ్ సాంగ్ చేసింది. అసలు విషయానికొస్తే అప్పట్లో చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున లాంటి హీరోల సరసన నటించిన శ్రియ.. 2018లో ఆండ్రూ కొశ్చీవ్ అనే విదేశీయుడిని పెళ్లి చేసుకుంది. తర్వాత ఈమెకు ఓ పాప కూడా పుట్టింది. ప్రస్తుతానికైతే కొన్ని సినిమాల్లో క్యారెక్టర్ రోల్స్ చేస్తోంది. మరికొన్ని చిత్రాల్లో హీరోయిన్‌గా చేస్తోంది. రీసెంట్ టైంలో అయితే హిట్ మూవీ 'మిరాయ్'లో తల్లి పాత్రలో కనిపించింది. ఇప్పుడు ఓ తమిళ మూవీలో ఐటమ్ సాంగ్ చేసి ఆశ్చర్యపరిచింది.

'నాన్ వయలెన్స్' పేరుతో తీస్తున్న ఓ సినిమాలో 'కనకం' అంటూ సాగే ఐటమ్ పాటలో శ్రియ డ్యాన్స్‌తో ఆకట్టుకుంది. ఈ ఏడాది రిలీజైన సూర్య 'రెట్రో'లోనూ ఐటమ్ సాంగ్ చేసింది గానీ ఎందుకనో అది పెద్దగా వైరల్ కాలేదు. ఇప్పుడొచ్చిన పాట మాత్రం శ్రియ గ్లామర్ ఏ మాత్రం తగ్గలేదని నిరూపిస్తోంది. 43 ఏళ్ల వయసులోనూ ఈ రేంజ్ అందం మెంటైన్ చేస్తోందని నెటిజన్లు, ఆమె అభిమానులు అవాక్కవుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com